

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 06-03-2025 | సంపుటి - 21 సంచిక - 315 రూ : 4 | పేజీలు: 8




# ఎమ్మెల్సీ అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు

- సీఎం, పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యనేతల సమావేశం
- ఢిల్లీలో జరిగే భేటీలో ఖరారుకు అవకాశం

హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటా నుంచి ఐదుగురు ఎమ్మెల్సీల ఎన్నికకు నామినేషన్ గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థుల ఎంపికపై అధికార కాంగ్రెస్ దృష్టి సారించింది. ఆశావహుల జాబితాను పరిశీలించడంతోపాటు సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. పోటీ తీవ్రస్థాయిలో ఉండటంతో అభ్యర్థుల ఖరారు పార్టీకి సవాల్‌గా మారింది. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌లు సమావేశమై ప్రాథమికంగా చర్చించారు. ఎంపికపై ఈ నెల 7న రాత్రి లేదా 8న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం సహా ముఖ్యులంతా సమావేశమై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఎమ్మెల్యేల కోటా నుంచి ఐదు ఎమ్మెల్సీల ఎన్నికకు ఈ నెల 10వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా మూడు కాంగ్రెస్‌కు, ఒకటి భారాసకు వస్తాయి. ఐదో స్థానం కోసం ఎంఐఎంతోపాటు మరికొన్ని ఓట్లు అవసరమవుతాయి. భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు ఓట్లు వేస్తే కాంగ్రెస్‌కు నాలుగో సీటు లభించే అవకాశమున్నా, సుప్రీంకోర్టులో కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్యేలు ఎలాంటి వైఖరి తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.

### హామీని గుర్తు చేస్తున్న సీపీఐ

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాలని ఇప్పటికే సీపీఐ కోరింది. సీపీఐ అగ్ర నాయకత్వం కూడా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మాట్లాడినట్లు తెలిసింది. ఒకవేళ సీపీఐకి ఇస్తే ఆ పార్టీ తరఫున ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి బలహీనవర్గాలకు చెందిన అభ్యర్థిని నిలిపే అవకాశముందని తెలుస్తోంది.

తరువాయి 2లో

## రూ. 1,500 కోట్ల పెట్టుబడితో

# లెన్స్‌కార్ట్ భారీ పరిశ్రమ

- సుమారు 1,600 మందికి ఉద్యోగావకాశాలు
- నేడు తుక్కుగూడలో మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన

హైదరాబాద్ : తెలంగాణలో భారీ కళ్లద్దాల పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రపంచంలోనే బ్రాండెడ్ కళ్లద్దాల సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన 'లెన్స్ కార్ట్' హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో ఉన్న నాన్ సెజ్ జనరల్ పార్కులో తమ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించనుంది. ఏకంగా రూ.1,500 కోట్ల పెట్టుబడితో నెలకొల్పనున్న ఈ కళ్లజోళ్లు, ఇతర అనుబంధ ఉత్పత్తుల తయారీ కేంద్రం ద్వారా సుమారు 1,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పరిశ్రమల శాఖ భావిస్తోంది. గత ఏడాది డిసెంబరు 8న లెన్స్ కార్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వానికి మధ్య దీనికి సంబంధించిన పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఇందులో భాగంగానే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం సంస్థ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నారు.

*** అంతర్జాతీయ ఎగుమతులు ఇక్కణ్నుంచే...**

ప్రపంచంలోనే అతి తరువాయి 2లో

lenskart

## భూకబ్జా...

# నిరోధక చట్టాన్ని ఆమోదించండి



- కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు సీఎం చంద్రబాబు వినతి
- పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేయండి
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభ్యర్థన
- జాతీయ రహదారుల ప్రాజెక్టులపై మంత్రి గడ్కరీతో చర్చ

దిల్లీ : ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు బుధవారం దిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీలను కలిసి కీలకమైన అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో భూకబ్జాల నిరోధానికి కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూకబ్జా నిరోధక చట్టానికి వెంటనే ఆమోదముద్ర వేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కోరారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా తరువాయి 2లో



# త్వరలో భూమికి వస్తున్నా

- సునీతా విలియమ్స్

కేప్ కెనవెరాల్: త్వరలోనే భూమి మీదకు వస్తానని భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ పేర్కొన్నారు. 9 నెలలుగా మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌తో కలిసి ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే.

తరువాయి 2లో

# చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

- తన విజయానికి సహకరించిన సీఎంకు ధన్యవాదాలు తెలిపిన గాదె

2లో



# భారత్‌పై సుంకాల మోత

- ఏప్రిల్ 2 నుంచి అమలు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టీకరణ
- శాంతిపై రష్యా నుంచి గట్టి సంకేతాలొచ్చాయని వెల్లడి
- అమెరికన్ కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించిన డొనాల్డ్

తరువాయి 2లో





# భాజపాకే పట్టాభిషేకం

- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం
- 5,106 ఓట్ల ఆధిక్యంతో గెలుపు
- రెండో ప్రాధాన్య ఓట్లతో తేలిన ఫలితం
- సిటింగ్ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్
- గట్టి పోటీ ఇచ్చిన బీఎస్పీ అభ్యర్థి

కరీంనగర్: ఉత్కంఠ భరితంగా సాగిన శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలో భాజపా విజయం సాధించింది. ఉమ్మడి కరీంనగర్

తరువాయి 2లో

# కొత్త నేర చట్టాల లక్ష్యం సత్వర న్యాయం

- 8 అంచెల్లో త్వరితగతిన విచారణ పూర్తికి చర్యలు
- యాప్‌లే అస్త్రాలుగా ప్రతి దశలోనూ టెక్నాలజీకి పెద్దపీట
- దేశంలో తొలిసారిగా చండీగఢ్ నుంచి శ్రీకారం

నిన్న మొన్నటి వరకూ దేశంలోని నేర న్యాయ వ్యవస్థ.. 19వ శతాబ్దంలో చేసిన చట్టాలకు అనుగుణంగానే పని చేసేది. వాటిని దేశాన్ని అప్పట్లో పాలించిన బ్రిటీషర్లు రూపొందించారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక దేశాన్ని రిపబ్లిక్‌గా మార్చుకున్నాం. మన రాజ్యాంగంలో న్యాయానికి, సమానత్వానికి రాజ్యాంగ నిర్మాతలు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. అయితే మన నేర న్యాయ చట్టాలు మాత్రం స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లదాకా మారలేదు. అప్పటి బ్రిటీష్ చట్టాల ఆధారంగానే నేర న్యాయ వ్యవస్థ కొనసాగింది. వీటికి ముగింపు పలుకుతూ

తరువాయి 2లో



# రూ.1,500 కోట్ల పెట్టుబడితో లెన్స్‌కార్ట్ భారీ పరిశ్రమ

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద కళ్లద్దాలు, ఇతర అనుబంధ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని 'లెన్స్ కార్ట్' తెలంగాణలో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే రాజస్థాన్‌లో ఈ సంస్థ ఒక అధునాతన తయారీ యూనిట్‌ను నిర్వహిస్తోంది. తెలంగాణలో నెలకొల్పనున్న ప్లాంట్ ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత అధునాతన కళ్ల జోళ్ల ఉత్పత్తి కేంద్రంగా మారుతుందని పరిశ్రమల శాఖ పేర్కొంది. భారతదేశ తయారీ రంగంలోనే ఇదొక మైలురాయిగా అభివర్ణించింది. ''రెండేళ్లలోపు దీని నిర్మాణాన్ని పూర్తిచేసి, నాలుగేళ్లలో పూర్తిస్థాయి ఉత్పత్తులను తయారుచేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ కొత్త పరిశ్రమ... అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణ ఖ్యాతిని మరింత బలోపేతం చేస్తుంది. ఇది కళ్లజోళ్ల ఉత్పత్తిలో నాణ్యత, ఆవిష్కరణలకు సంబంధించి సరికొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఇక్కడ తయారు చేసే ఉత్పత్తులను భారతీయ వినియోగదారులకు మాత్రమే కాకుండా... ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకూ ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం లెన్స్‌కార్ట్ తమ కళ్లజోళ్ల ఉత్పత్తులను జపాన్, సింగపూర్, థాయిలాండ్, తైవాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, మలేసియా, వియత్నాం, యూఏఈ, సౌదీ అరేబియా తదితర దేశాలకు అధికంగా ఎగుమతి చేస్తోంది. ఈ మెగా ప్లాంట్‌ను అందుబాటులోకి వచ్చాక లెన్స్‌కార్ట్ ప్రపంచ పరిధి మరింత విస్తరించనుంది. ఇది తెలంగాణ తయారీ రంగంలో, అంతర్జాతీయ వాణిజ్యంలో పురోగతికి మార్గం సుగమం చేస్తుంది'' అని పరిశ్రమల శాఖ పేర్కొంది.

# ఎమ్మెల్సీ అభ్యర్థులపై కాంగ్రెస్ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

ఒక మహిళకు కూడా అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి శారద, సరిత, పారిజాత, విజయ తదితరులు టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. గతంలో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలిచి ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయని జీవన్‌రెడ్డి తనకు ఎమ్మెల్యేల కోటాలో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్ ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శాసనమండలికి పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు గత శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి ఓడిన వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వబోరని సమాచారం. మైనార్టీల నుంచి ఒకరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్న ఆలోచన కూడా ఉందని, ఇందులో భాగంగా ఆ వర్గం నుంచి ఒకరికి ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అవకాశం లేకపోలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం జరిగిన సమావేశంలో ప్రాథమికంగానే చర్చ జరిగిందని, ఢిల్లీలో జరిగే భేటీలో సీట్లు ఖరారవుతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**సీఎం నివాసానికి మీనాక్షి**

హైదరాబాద్: త్వరలో జరగనున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పార్టీ రాష్ట్ర ఉన్నతస్థాయి కమిటీ సమావేశం బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జరిగింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి సమావేశంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. సామాజికవర్గాల వారీగా... ఒక్కో ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురు పేర్లతో ప్రతిపాదనలను ఏఐసీసీకి పంపుతారని, అక్కడ తుది జాబితాను ప్రకటిస్తారని నేతలు వెల్లడించారు.

# భూకబ్జా నిరోధక చట్టాన్ని ఆమోదించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆదుకోవడంతోపాటు, పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు ఆర్థికసాయం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అభ్యర్థించారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ బందరు పోర్టు మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతోపాటు మరికొన్ని జాతీయ రహదారులపై రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించారు. అనంతరం ఢిల్లీలో తన అధికారిక నివాసం 1 జనపథ్‌లో విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో రాజకీయ అంశాలు, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు చెప్పారు. 'గత అయిదేళ్లలో భూకబ్జాలు పెద్ద సమస్యగా మారాయి. ఈరోజు రాష్ట్ర ప్రభుత్వానికి అందుతున్న ప్రతి 10 ఫిర్యాదుల్లో ఆరు భూ కబ్జాలవే ఉంటున్నాయి. కంప్యూటరీకరణలో చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ లేకపోవడం వల్ల నాయకులు, అధికారులు కుమ్మక్కై బలవంతంగా ప్రైవేటు భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారు. బాధితులు ఆ భూములను ఎంతో కొంత అమ్మడానికి సిద్ధమైతే వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించి చేజిక్కించుకున్నారు. ఇంటి పట్టాల పేరుతో కూడా చాలా భూమిని కబ్జా చేశారు. అటవీ, బంజరు భూములను ఆక్రమించారు. అలాంటి అక్రమాలను కఠినంగా అణచివేయడానికి మేం ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేసి, కేంద్ర ఆమోదం కోసం పంపాం. సాధ్యమైనంత త్వరగా దానికి ఆమోదం తెలపాలని హోం మంత్రిని కోరాం. ప్రివెన్షన్ ఆఫ్ యాక్టివిటీస్ ఆఫ్ బూట్‌లెగ్గర్స్, డెకాయిట్స్, డ్రగ్ అఫెండర్స్, గూండాస్, ఇమ్మోరల్ ట్రాఫికింగ్‌కు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి అనుమతి కోరాం. రాష్ట్రంలో గత ప్రభుత్వ నిర్వాకం వల్ల గంజాయి, డ్రగ్స్ సమస్య తీవ్రంగా ఉంది. ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసి దీన్ని నియంత్రిస్తున్నాం. గంజాయిని సాగు స్థాయిలోనే ధ్వంసం చేస్తున్నాం. ఈ బిల్లు అమల్లోకి వస్తే గంజాయి, డ్రగ్స్ పూర్తి నియంత్రణ సాధ్యమవుతుంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షంగా మేం రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించీ చర్చించాం. గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం రూ.10 లక్షల అప్పు చేసింది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ అప్పు తీసుకొనే సామర్థ్యం సున్నాకు పడిపోయిందని ఇటీవల నీతిఆయోగ్ నివేదిక వెల్లడించింది. ప్రజలు ఎన్నో ఆకాంక్షలతో గత అసెంబ్లీ ఎన్నికలు, తాజాగా జరిగిన శాసనమండలి ఎన్నికల్లో భారీ మెజార్టీతో మమ్మల్ని గెలిపించారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. తొలి ఏడాది 12.94% వృద్ధిరేటు సాధించాం. ఈ ఏడాది నుంచి 15% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నాం. అభివృద్ధి, సంపద సృష్టి, ఆదాయ వృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ, ప్రజలకు సాధికారత కల్పించడమే మా ముందున్న ప్రాధమ్యాలు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆర్థిక అంశాల గురించి చర్చించాం. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు ఆర్థిక సాయం కోరాం. ఈ ప్రాజెక్టుతో వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానించి రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చడానికి వీలవుతుంది. రాజమహేంద్రవరం తర్వాత సముద్రంలోకి వెళ్లే నీటిని వాడుకోవడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. పోలవరం ప్రాజెక్టుపై ఈ ఏడాది రూ.5 వేల కోట్లు ఖర్చు పెట్టబోతున్నాం. వచ్చే రెండేళ్లలో తొలి దశ నిర్మాణం పూర్తవుతుంది. తర్వాత రెండో దశలో 47.72 మీటర్ల వరకు పూర్తి చేస్తాం. నితిన్ గడ్కరీకి పలు జాతీయ రహదారుల కోసం విజ్ఞప్తి చేశాం. విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కోరాం. అమరావతికి 140 మీటర్ల వెడల్పుతో 189 కి.మీ. అవుటర్ రింగ్‌రోడ్డు గురించి చర్చించాం. దీన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తాం. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి వచ్చే భక్తుల రద్దీ పెరిగి అటవీ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నందున ఈ మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ లేదా రహదారుల విస్తరణ చేపట్టాలని కోరాం. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అమరావతి వినుకొండ, విశాఖపట్నం మూలపేట రహదారులు వేగంగా పూర్తి చేయాలని కోరాం.

# చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

అమరావతి: సీఎం చంద్రబాబును ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన విజయానికి అన్ని విధాలుగా సహకరించిన చంద్రబాబు, ఎన్డీయే నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గాదెను చంద్రబాబు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు పాల్గొన్నారు.

*** రెండో ప్రాధాన్యత ఓటు నాకే వేయమని సీఎం చెప్పారు: గాదె**

డిజిటల్, అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకే రెండో ప్రాధాన్య ఓటు వేయాలని కూటమి పార్టీల నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఎన్నికల్లో సహకారం అందించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సచివాలయం బయట ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల ప్రతినిధిగానే గెలిచా. దీనికి రాజకీయాన్ని ఆపాదించదలుచుకోలేదు. ఈ విజయం ఉపాధ్యాయ సంఘాల కూటమి ఇచ్చిన గెలుపు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయడానికి ప్రయత్నిస్తా. ఎన్నికల్లో మద్దతిచ్చిన మిత్ర సంఘాలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యా. ఉపాధ్యాయ సమస్యలేమున్నా.. కలిసి పరిష్కరిద్దామని ఆయన తెలిపారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసి ఏకీకృత సర్వీసు నిబంధనలను తీసుకొచ్చా. ప్రభుత్వం మారాక అది ముందుకెళ్లకుండా ఎక్కడికక్కడ ఆగిపోయింది. దాని గురించి ఈ రోజు ముఖ్యమంత్రే ప్రస్తావించారు. 20 ఏళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను చంద్రబాబుతో పాటు విద్యాశాఖ మంత్రి లోకేశ్ సహకారంతో పరిష్కరిస్తా. సీపీఎస్ రద్దు వంటి ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా' అని తెలిపారు.

# భారత్‌పై సుంకాల మోత

వాషింగ్టన్, న్యూయార్క్: భారత్ అధిక దిగుమతి సుంకాలను విధిస్తోందని, అందుకే ఏప్రిల్ 2 నుంచి ఆ దేశంపై భారీగా ప్రతీకార సుంకాలను అమలు చేయబోతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. అధిక సుంకాల విధానం అనుచితమని, అలాంటి దేశాలన్నింటిపైనా సుంకాలను విధిస్తున్నామని పేర్కొన్నారు. శాంతి చర్చలను రష్యా కోరుకుంటోందని, ఆ దేశం నుంచి గట్టి సంకేతాలొచ్చాయని, ఉక్రెయిన్ ఆ దిశగానే పయనిస్తోందని తెలిపారు. మంగళవారం అమెరికన్ కాంగ్రెస్ ఉభయసభల సంయుక్త సమావేశంలో ఆయన ప్రసంగించారు. అధ్యక్షుడయ్యాక తొలిసారిగా ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన ఆయన అమెరికా చరిత్రలోనే అత్యధిక సమయం మాట్లాడిన నేతగా నిలిచారు. ఉభయ సభలనుద్దేశించి ట్రంప్ 1.40 గంటలపాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. అంతకుముందు సుదీర్ఘంగా మాట్లాడిన రికార్డు బిల్ క్లింటన్ పేరిట ఉండేది. ఆయన 1.28 గంటలపాటు మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ, వలస, విదేశీ విధానాలను ట్రంప్ ప్రస్తావించారు. అమెరికాకు స్వర్ణ యుగం ప్రారంభమైందని తెలిపారు. ట్రంప్ ప్రసంగం ముగియగానే సభ్యులంతా లేచి నిల్చొని కరతాళ ధ్వనులతో అభినందించారు. 'ఫైట్.. ఫైట్.. ఫైట్' అని నినదించారు. ప్రసంగం ముగిసే సరికి డెమోక్రాట్ సభ్యులంతా వెళ్లిపోగా రిపబ్లికన్ సభ్యులు అధ్యక్షుడితో కరచాలనం చేస్తూ ఉండిపోయారు.

*** అమెరికాలో తయారు చేయకపోతే సుంకాలే**

'మీ వస్తువును మీరు అమెరికాలో ఉత్పత్తి చేయకపోతే ట్రంప్ పాలనలో సుంకాలను భరించాల్సిందే. కొన్ని వస్తువుల విషయంలో అది మరింత అధికంగా ఉంటుంది. దశాబ్దాలుగా పలు దేశాలు మనపై సుంకాలను విధిస్తూ వస్తున్నాయి. ఇప్పుడు మన సమయం వచ్చింది. ఐరోపా దేశాలు, చైనా, బ్రెజిల్, భారత్, మెక్సికో, కెనడాతోపాటు పలు దేశాలు మనపై అత్యధిక సుంకాలను విధిస్తున్నాయి.

# త్వరలో భూమికి వస్తున్నా

(మొదటిపేజీ తరువాయి)

విల్‌మోర్‌తో కలిసి ఆమె మంగళవారం ఐఎస్ఎస్ నుంచి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా త్వరలోనే భూమి మీదకు చేరుకుంటానని తెలిపారు. ''నా కుటుంబం నాకెంతో ప్రోత్సాహాన్నిచ్చింది. నేను ఓ మిషన్ మీద ఇక్కడకు వచ్చాను. కష్టమైన విషయమేంటంటే భూమి మీద ఉన్నవారికి మేం ఎప్పుడొస్తామో తెలియకపోవడం. రోజూ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నాను. వారికి నేను చెప్పేదేంటంటే.. వస్తున్నాను. నేను లేకుండా ఎలాంటి ప్రణాళికలు వేసుకోకండి'' అని విలియమ్స్ నవ్వుతూ తెలిపారు. తనింట్లో రెండు లాబ్రాడార్ శునకాలు ఉన్నాయని, వాటిని ఎప్పుడు కలుస్తానా అని ఎదురుచూస్తున్నానని చెప్పారు. వ్యోమగాములను భూమిపైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై అడిగిన ప్రశ్నలకు విల్‌మోర్ స్పందించారు. రాజకీయాలు జీవితంలో భాగమని.. అయితే తాము వెనక్కి తిరిగొచ్చే విషయంలో అవి ఎలాంటి పాత్ర పోషించలేదని అన్నారు. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో విలియమ్స్, విల్‌మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రణాళిక ప్రకారం 8 రోజులకే వీరు తిరిగి భూమిని చేరుకోవాల్సి ఉంది. స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారు లేకుండానే అది భూమిని చేరుకుంది. అప్పటి నుంచి వీరు ఐఎస్ఎస్‌లోనే ఉంటున్నారు. వీరిని తిరిగి తీసుకురావడానికి నాసా.. స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఈ నెల 12న స్పేస్‌ఎక్స్‌కు చెందిన క్రూ10 అంతరిక్షనౌక ఐఎస్ఎస్‌కు వెళ్లనుంది. ఆ నౌకలోనే తిరిగి వీరు భూమి మీదకు చేరుకోనున్నారు.

# భాజపాకే పట్టాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఆ పార్టీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యంతో జయకేతనం ఎగురవేశారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలింది. ఇక్కడ కాంగ్రెస్ తన సిటింగ్ సీటును కోల్పోయింది. ఇప్పటికే ఈ నెల 3న వెలువడిన ఫలితాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా భాజపా మద్దతుదారు మల్క కొమరయ్య గెలిచారు. దీంతో ఉత్తర తెలంగాణలో కీలకమైన రెండు ఎమ్మెల్సీ స్థానాలను భాజపా తన ఖాతాలో వేసుకున్నట్లైంది. కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ మైదానంలో లెక్కింపు జరిగింది. సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ బుధవారం రాత్రి 9 గంటలకు ముగిసింది. ఈ స్థానంలో మొత్తం 56 మంది బరిలో నిలిచారు.

**హోరాహోరీ పోరులో..**

మొదటి ప్రాధాన్య ఓట్ల సాధనలో భాజపా, కాంగ్రెస్‌ల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. మూడో స్థానంలో నిలిచిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గట్టిపోటీనిచ్చారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనంతరం భాజపా అభ్యర్థి అంజిరెడ్డి 98,637 ఓట్లు సాధించగా, నరేందర్‌రెడ్డి 93,531 ఓట్లు పొందారు. మొత్తం 3,55,159 మంది ఓటర్లుండగా గత నెల 27న జరిగిన పోలింగ్‌లో 2,52,029 మంది ఓటేశారు. లెక్కింపు సమయంలో 28,686 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 2,23,343 ఓట్ల నుంచి గెలుపు కోటాను 1,11,672గా అధికారులు నిర్ణయించారు. మొత్తం 11 రౌండ్లలో లెక్కింపు కొనసాగగా తొలి రౌండ్ నుంచి భాజపా అభ్యర్థి ఆధిక్యం ప్రదర్శించారు. ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది రౌండ్లలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి కొంత ఆధిక్యం పొందినా మిగతా రౌండ్లలో అంజిరెడ్డి దూసుకెళ్లారు. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ముగిసే సమయానికి 75,675 ఓట్లతో భాజపా మొదటి స్థానంలో ఉండగా 70,565 ఓట్లతో కాంగ్రెస్, 60,419 ఓట్లతో బీఎస్పీ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

**వరుసగా ఎలిమినేట్ చేస్తూ..**

గెలుపు కోటాను చేరాలంటే రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి వచ్చింది. బుధవారం ఉదయం 10 గంటల నుంచి వీటి లెక్కింపు ప్రారంభించి రాత్రి 9 గంటలకు పూర్తి చేశారు. తక్కువ ఓట్లు పొందిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ చేపట్టారు. ఇలా 53 మందిని ఎలిమినేట్ చేశారు. మూడోస్థానంలో ఉన్న బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ వరకు వారు సాధించిన ఓట్లలో రెండో ప్రాధాన్య ఓట్లను గణించారు. ప్రసన్న హరికృష్ణకు వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్య ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి ఒకింత పైచేయి సాధించినా మొత్తంగా భాజపా అభ్యర్థి 5,106 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. దీంతో భాజపా అభ్యర్థి గెలుపు ఖరారైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా భాజపా శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించారు.

# కొత్త నేర చట్టాల లక్ష్యం సత్వర న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

గత ఏడాది కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త చట్టాలను అమల్లోకి తీసుకొచ్చింది. అందులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) ఉన్నాయి. వీటి లక్ష్యం రాజ్యాంగంలో పేర్కొన్నట్లు అందరికీ న్యాయం, సమానత్వంపై దృష్టి సారించడమే. దీంతోపాటు సత్వర న్యాయం అందించడమే. బాధితులకు త్వరగా సాంత్వన కలిగించడంతోపాటు నిందితులకు శిక్షలు పడేలా చేయాలన్నదే ఇందులో అత్యంత ముఖ్యమైనది.

**ప్రయోగాత్మకంగా చండీగఢ్‌లో..**

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త చట్టాలను మొదట కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఇందుకోసం అధికారులకు శిక్షణ ఇవ్వడంతోపాటు మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించింది.

## చిన్నారులు... ఆవిష్కర్తలు

- ఆకట్టుకున్న బాలుని ఆవిష్కరణ




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థుల దృష్టి మళ్లీంచేందుకు, వారిలో దాగున్న సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించి వెలికి తీసేందుకు భారత శాస్త్రవేత్త సివి రామన్ జయంతి సందర్భంగా ప్రతీ ఏటా జాతీయ సైన్స్ డే వేడుకలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులు వారి ఆలోచనలకు తగ్గట్లు పలు రకాల ఎగ్జిబిట్లను తయారు చేసిన ప్రదర్శనలు ఇస్తారు. ఈ విధంగా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలోని జడ్పిహెచ్ఎస్‌లో చదువుతున్న ఆరవ తరగతి విద్యార్థి నరేంద్ర చారి కుమారుడు నీరజ్ తన చిట్టి బుర్రతో మినీ కూలర్ తయారు చేశాడు. ఈ మినీ కూలర్‌ను పలువురిని ఆకట్టుకుంది. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఉన్న ఆలోచనలు వెలికి తీసేందుకు దోహద పడుతాయని, మినీ కూలర్‌ను తయారు చేసిన బాలున్ని పలువురు అభినందించారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణానికి వచ్చే భక్తులకు అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వచ్చే నెల 06 , 07 తేదీలలో జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణం, పట్టాభిషేకం వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై ఈ నెల 06 తేదీ ఉదయం 11 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారుల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం , పట్టాభిషేకంనకు వివిధ రాష్ట్రాల నుండి భక్తులు కళ్యాణం తిలకించడానికి వస్తారని, వారికి అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించడానికి సమగ్ర సమాచారము తో సంబంధిత జిల్లా అధికారులు ఈ యొక్క సమావేశానికి తప్పనిసరిగా రావాలని ఆయన కోరారు.

## ఘనంగా అధ్యక్షులు ఉప్పల రమేష్ జన్మదిన వేడుకలు





రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, యాదగిరిగుట్ట లోటస్ టెంపుల్ శ్రీ వాసవి నిత్యాన్న సత్రం కార్యదర్శి ఉప్పల రమేష్ జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. రాజపేట మండల ఆర్యవైశ్యులు, పట్టణ రఘునాథపురం ఆర్యవైశ్యులు, జర్నలిస్టులు, తోటి స్నేహితులు, బంధువులు, ఆప్తులు వర్తక వ్యాపారస్తులు, నాయకులు ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేయగా పుష్పగుచ్చం, శాలువాలు, ప్రత్యేక బహుమతులతో సత్కరించారు. సత్కరించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిర ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ గోత్రనామార్చన పూజలు జరిగాయి.

## ప్రముఖ గాయని కల్పనను పరామర్శించిన కార్పొరేటర్



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని తెలుసుకున్న హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు బుధవారం హోలిస్టిక్ హాస్పిటల్ లో సీఈఓ డాక్టర్ సుబ్బారావు తో కలిసి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గాయని కల్పన ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆమెకు ప్రభుత్వం తరపున, నా తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కల్పన ప్రస్తుతం వైద్యుల సమాచారం ప్రకారం ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుట పడుతుందని, రెండు రోజుల్లో ఆమె మరింతగా కోలుకుంటుందన్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు చెప్పారు.

# ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కింది



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొట్టమొదటిసారిగా ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని నీల ముదిరాజ్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లు అన్నారు. బుధవారం శంషాబాద్ లో గల ఎమ్మెస్ గార్డెన్ లో నిర్వహించిన రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముదిరాజ్ కృతజ్ఞత సభకు తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ తనతో రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కులగన సర్వేను తెలంగాణ రాష్ట్రం పూర్తిచేసి రాష్ట్రంలో అధిక జనాభా ముదిరాజులే అని అధికారికంగా తేల్చిన కాంగ్రెస్ పార్టీ కి రాహుల్ గాంధీ , మల్లికార్జున్ కార్గే కి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి కులగన సర్వే సబ్ కమిటీ చైర్మన్ ఉత్తంకుమార్ రెడ్డి కి బీసీ సంక్షేమ శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్ కి, పిసిసి అధ్యక్షులు కి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిగా సి జగన్నాథ రావు ముదిరాజ్ ని నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దక్కుతుందన్నారు.. గతంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ తరపున ముదిరాజుల చిరకాల కోరిక అయిన బీసీడీ నుండి బీసీఏ మార్పి రిజర్వేషన్ల సమస్య పరిష్కారానికి చేయడానికి జీవో నెంబర్ 15 విడుదల చేసి ప్రయత్నం చేసిన పార్టీ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నే . దురదృష్టశాతం ఆ జీవో హైకోర్టులో కొట్టివేయడం ఆ తర్వాత సుప్రీంకోర్టుకు పోవడం వలన ఆ జీవో అమలుకు నోచుకోలేదు. సుప్రీంకోర్టు ఆ కేసు 2022 అక్టోబర్ లో రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిన ఎటువంటి చర్యలు తీసుకోకుండా మన ముదిరాజులకు తీవ్రష్టం చేసిన పార్టీ టిఆర్ఎస్ పార్టీ. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత కూడా ముదిరాజుల వైపు చిన్నచూపు చూడకుండా నీలం మధు ముదిరాజ్ కి ఎంపీ టికెట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అలాగే కాంగ్రెస్ ముదిరాజులను బిసిడి నుండి బీసీ ఏ మారుస్తానని ముదిరాజులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వం వచ్చిన వెంటనే ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ముదిరాజుల పట్ల తన చిత్తశుద్ధి చూపిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అలాగే మన యొక్క రిజర్వేషన్స్ సమస్య ను తీర్చగలిగే ఒకే ఒక పార్టీ కాంగ్రెస్ పార్టీ అందువల్ల ముదిరాజులందరూ ఐక్యంగా ఉంటే మనకు రావాల్సిన వాటా సాధించుకోవడం కష్టమేమి కాదు అందుకే ఈరోజు కృతజ్ఞత సభ ఏర్పాటుచేసి ముదిరాజ్ బంధువులకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం హైకోర్టు అడ్వకేట్ వినోద్ ముదిరాజ్, యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా తరపున కృతజ్ఞత సభకు వెళ్లిన సందర్భంగా ముదిరాజ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఘనంగా శాలువాతో సన్మానించారు. రాష్ట్రకాంగ్రెస్ సేవాదళ్ జనరల్ సెక్రెటరీ పిట్టల బాలరాజ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్వకేట్ పోతాల చంద్రమోహన్, యాదాద్రి జిల్లా మహిళా నాయకురాలు ఝాన్సీ, పిట్టల ఆనంద్, ఫలపట్టి లింగస్వామి,అన్నపు గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా ఫ్రెషర్స్ డే వేడుకలు




యాదాద్రి భువనగిరి జిల్లా, (ప్రజాస్ఫూర్తి) : వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగం లో ఫ్రెషర్స్ డే వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్, కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఫౌండర్ స్వర్గీయ దరిపల్లి అనంత రాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదనంతరం వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైందని ఈ దశలోనే విద్యార్థులు ఉన్నత పౌరులుగా ఎదగాలని అన్నారు. విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను ఎప్పటికప్పుడు వారిలో దాగి ఉన్న ఇన్నోవేషన్ల ను విజయవంతం చేసే దిశగా ఉంటామని అన్నారు. వాత్సల్య కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మీ లక్ష్యాలను సాధించినప్పుడే జీవితం సార్థకం అవుతుందని ప్రతి విద్యార్థి వారి యొక్క లక్ష్యాలను ఎంచుకొని దానిని నెరవేర్చుకోవాలని తద్వారా ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. క్యాంపస్ ప్లేస్మెంట్లలో విద్యార్థులందరికీ ఉద్యోగాలు వచ్చే విధంగా మాపై బాధ్యత ఉందని, దాన్ని ఖచ్చితంగా నెరవేరుస్తామని అన్నారు. ప్రతీ సంవత్సరం జాబ్ మేళాలు నిర్వహించి విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. ప్రిన్సిపల్ బివి రెడ్డి మాట్లాడుతూ 100 శాతం మార్కులు సాధించే దిశగా విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దరమే మా లక్ష్యం అన్నారు. తదనంతరం విద్యార్థులు ట్రెడిషనల్ దుస్తులతో ర్యాంప్ వాక్ నిర్వహించినారు. విద్యార్థుల ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమమునకు వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్, కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ తో పాటు ప్రిన్సిపల్ బి వి రెడ్డి, అకాడమిక్ ఇన్చార్జ్ గొల్లపల్లి సురేష్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నరేందర్ రెడ్డి, వెంకటేష్, రామాంజనేయులు, శృతి, నర్మద, కరుణాకర్, ప్రగతి, రేఖ, పరమేశ్వరి, శ్రీధర్ బాబు, సునీల్, భవాని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ గోపాలకృష్ణ, చంద్రశేఖర్, కావ్య, శంకర్, కల్పన, స్వాపిక మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జల్సాలకు అలవాటుపడి చోరీలు

* **పలు చోరీ కేసుల్లో దొంగ అరెస్ట్**
* **వివరాలను వెల్లడిచిన ముస్తాబాద్ ఎస్ఐ గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: జల్సాలకు అలవాటుపడి పలు చోరీలకు పాల్పడ్డ దొంగను అరెస్ట్ చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ తెలిపారు. బుధవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ లో దొంగ అరెస్ట్ వివరాలను ఎస్ఐ వెల్లడిచారు. పలు చోరీ కేసుల్లో తెర్లుమద్ది గ్రామానికి చెందిన మామిండ్ల ఆంజనేయులు అనే దొంగను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడిన ఆంజనేయులు డబ్బు కోసం గత కొన్ని నెలలుగా ముస్తాబాద్, చుట్టూ పక్కల గ్రామాలైన గూడూరు,మొర్రాయిపల్లె లలో తాళం వేసి ఉన్న గుళ్లలో చొరబడి హుండీలో, డబ్బులను, గుడిలోని విలువైన వస్తువులను దొంగతనం చేసి, వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడ్డాడని తెలిపారు. ఈ చోరీ కేసుల్లో ఆంజనేయులును బుధవారం ఉదయం ముస్తాబాద్ శివారులోని ఎఎంఆర్ గార్డెన్ వద్ద పట్టుకొని అరెస్ట్ చేసి, రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానంగా సంచరించిన, కొత్త వ్యక్తులు వచ్చి ఉంటున్న పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అంతేగాకుండా గ్రామాల్లో సిసి కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి నేరం జరిగిన అక్కడ సిసి కెమరాలు ఉంటే నేరస్తులను గుర్తించేందుకు దోహద పడుతాయని ముస్తాబాద్ ఎస్సై గణేష్ అన్నారు. ఎస్సైతో కానిస్టేబుల్ రాజశేఖర్, కాశీం ఉన్నారు.

## కమిషనర్ , డైరెక్టర్ నరసింహారెడ్డిని కలిసిన ట్రస్మా ప్రతినిధులు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రతి సంవత్సరం ఫీజు 15% పెంచుకునే అధికారం పాఠశాల యాజమాన్యాలకి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల సం ఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ రాష్ట్ర కమిషనర్ , డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నరసింహారెడ్డి ని, ప్రధాన కార్యదర్శి కె. అనిల్ కుమార్, ట్రెజరర్ కె.శ్రీకాంత్ రెడ్డి , ట్రస్మ ప్రతినిధులు కే రామేశ్వర్ రెడ్డి ,జయరాం, భార్గవ తదితరులు కలిసి పాఠశాలల సమస్యలపై మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల ఖర్చు ను బట్టి ఫీజు పాఠశాల యాజమాన్యాలే ఫిక్స్ చేసుకునే విధంగా ఉండాలన్నారు. ఫీజు వసూలు చేసుకునే హక్కు పాఠశాలకే ఇవ్వాలన్నారు. ఫీజు కట్టని విద్యార్థుల యొక్క పేర్లను యుడైస్ లో ఎంఈఓ లు గానీ, ఇతరులు తొలగించకుండా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థికి టీసి అనేది తప్పనిసరిగా ఉండాలన్నారు. పాఠశాల మీద సంఘ వ్యతిరేక శక్తుల వివిధ సంఘాల అరాచకాలను, అవాంఛనీయ సంఘటన జరగకుండా రక్షణ ప్రభుత్వమే కల్పించాలని కోరారు.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా లక్ష్మీదేవిపల్లిలోని నలంద జూనియర్ కళాశాల నందు గల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు , ఎస్సైలు నరేష్, రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సైరెడ్డి నరసింహ రెడ్డి



బోడుప్పల్: సామాన్య ప్రజలకు సరైన సమయంలో ప్రథమ చికిత్స అందించడంలో అర్ఎంపీ,పీఎంపీల పాత్ర చాల కీలకమని అర్ఎంపీ,పీఎంపీల అధ్యక్షుడు సైరెడ్డి నరసింహ రెడ్డి అన్నారు. బుధవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన అర్ఎంపీ,పీఎంపీల సమావేశంలో నూతన అధ్యక్షుడిగా సైరెడ్డి నరసింహ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న అర్ఎంపీ,పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగాఎ. శ్రీనివాస్,మహేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి రాజేందర్ రావు, సంయుక్త కార్యదర్శిగా భాసాని విద్యాసాగర, వెంకట్ రెడ్డి, కోశాధికారిగాఎ. కుమార్,గౌరవ అధ్యక్షులుగా వి.చంద్రమౌళి,ముఖ్య సలహాదారుగా ఎం.ఆనంద రాజ్, డి సంజీవ, కార్యవర్గ సభ్యులుగా రచ్చ వాసుదేవ్ ,ఎం వి గౌడ్,శ్యాంసుందర్ లను ఎన్నుకున్నారు.

## ఘనంగా జిల్లా కలెక్టరేట్ భవన్ లో మహిళా దినోత్సవ వేడుకలు



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ భవన్ లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీజీఓ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రీడలు, నృత్యము,సాంగ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి , డిఆర్ఓ హరిప్రియ , డీఈఓ విజయ కుమారి , టీజీఓ అధ్యక్షులు జి.వినోద్ కుమార్, కార్యదర్శి డా. కురు మూర్తి, గౌరవ రాధిక , ఎంప్లాయిమెంట్ అధికారి ,గౌరవ జాన్సి , బీసీ డెవలప్ మెంట్ , గోపాల్ రావు యూత్ &స్పోర్ట్స్ డిపార్ట్ మెంటు, శివ ప్రసాద్ , ఎల్ డీఎం , టీజీఓ ఉపాధ్యక్షులు రవీందర్, జిల్లా టీజీఓ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా దైనందిన జీవితం లో మహిళల పాత్ర, మహిళా శక్తి , మహిళల ధైర్య సాహసాలు, ఓర్పు సహనం గురించి క్లుప్తంగా వివరించారు.

# కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

* **సిఐటియు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కార్మికుల సమస్యలు ఎన్నిసార్లు విన్నవించిన అపరిష్కృతంగా ఉన్నాయని వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రగతి నగర్ లోని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ కమిషనర్ ఎండి సాబీర్ అలీ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా



నాయకులు ఎం. చంద్రశేఖర్, యూనియన్ ఉపాధ్యక్షులు పి. పెంటయ్య మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు నెల మొదటి తేదీ ఇస్తామని అనేకసార్లు వాగ్దానం చేసిన అమలు కావడం లేదు అన్నారు. వేతనాలు పనిచేసిన అన్ని రోజులకు వేతనం పూర్తిగా రావట్లేదు అన్నారు. వేతనంలో కోతలు విధిస్తున్నారని వాటిని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు నాలుగు రోజులు అమలు చేయడం లేదని, కార్మికులతో నాలుగు ఆదివారాలు పనిచేయించుకుంటున్నారు కనీస వేతనం రూ.26000 నిర్ణయించే వరకు ఆంధ్రప్రదేశ్లోని మున్సిపల్ కార్మికుల వేతనం రూ.21000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికీ మొదటి ప్రాధాన్యతగా ఇవ్వాలని కోరారు. కార్మికుల యొక్క చదువు, నైపుణ్యతను గుర్తించి అర్హతలను బట్టి జవాన్లుగా ,డ్రైవర్లుగా సానిటరీ ఇన్స్పెక్టర్ లుగా ఎమోషన్స్ ఇవ్వాలని కోరారు. పని ప్రాధాన్యత స్వభావాన్ని బట్టి వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లుగా సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు 19500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రైన్ కోట్లు స్వెటర్లు చెప్పులు సబ్బులు చీపుర్లు కొబ్బరి నూనె ఇతర సామాగ్రి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగ శేషు, సత్యనారాయణ, జైపాల్, చెన్నయ్య ,మనీ వెంకటమ్మ బుజ్జి తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్ లో సత్తాచాటిన విజయరత్న విద్యార్థులు




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఎలాంటి పోటి పరీక్షలోనైనా విజయరత్న స్కూల్ విద్యార్థులు సత్తాచాటుతున్నారని డైరెక్టర్లు విజయసేనా రెడ్డి, నరేంధ్రనాద్, నరసింహ,శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు.సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన పోటీ పరీక్షలలో విజయరత్న విద్యార్దులు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ 25 మెడల్స్, అంతర్జాతీయ జనరల్ ఒలంపియాడ్ లో 22 మెడల్స్ సాదించి విద్యార్దులు మరోమారు తమ సత్తా చాటారు.గోల్డ్ మెడల్స్ సాదించిన విద్యార్థులను డైరెక్టర్లు ప్రశంసించారు.ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఘనత సాదించినందుకు మాకు గర్వకారణంగా ఉందని వారి పట్టుదల,కృషి విజయానికి కారణమని కొనియాడారు.ఇది మా ఉపాధ్యాయ బృందం నిర్విరామ శిక్షణ,తల్లిదండ్రుల సహకారం విద్యార్థుల నిరంతర కృషికి అద్దం పడుతోందని పేర్కొన్నారు. మా విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఘన విజయాలను సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ప్రతి విద్యార్ది స్కూల్ దశ నుండే ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దానికి తగినట్లుగా పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. పేదరికాన్ని జయించాలంటే చదువు ఒక్కటే మార్గమని తెలిపారు.మెడల్స్ పొందిన ప్రతి విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఇంకా ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు.



# జిల్లా సమగ్ర అభివృద్ధిలో టీఎన్జీవోలు భాగస్వామ్యం కావాలి

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా అభివృద్ధి ప్రజల ఆకాంక్ష అయితే.. సమగ్ర అభివృద్ధి మీ బాధ్యత అని టీఎన్జీవోస్ నాయకులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా ఆ సంఘ నూతన డైరీ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకనుగుణంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలను, గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి పరుచుకోవడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, జిల్లా సమ్మిళితాభివృద్ధిని కొనసాగించేలా విస్తృ త పరిధిలో ఒక సమీకృత విధానాన్ని రూపొందించుకోవాలని, జిల్లా అభ్యున్నతికి సలహాలు సూచనలు ఇవ్వాలని టీఎన్జీవోస్ నాయకులను కోరారు. ప్రధానంగా రైతులకు సాంకేతికతను అవలంబించడంపై మెరుగైన అవగాహన కల్పించడానికి విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహించాలని, వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రవేశపెట్టడానికి , విస్తరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ అన్నారు. టీఎన్జీవో సంఘం తరపున వ్యవసాయ రంగం బలోపేతం కోసం అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు, కార్యదర్శి సాయి భార్గవ్ చైతన్య , జిల్లా కార్యవర్గం పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక.. విధివిధానాలపై కోర్ కమిటీ భేటీ

హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కోర్ కమిటీ భేటీ అయింది. జూబ్లీహిల్స్లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొన్నారు. గంటకుపైగా కొనసాగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈనెల 29న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ ఏర్పడుతున్నాయి. వాటిని భర్తీ చేసేందుకు ఇప్పటికే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నెల 10న వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవడానికి గడువు విధించింది. ప్రధానంగా ఖాళీ ఏర్పడిన 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి భారాసకు, మిగిలినవి కాంగ్రెస్ పార్టీకి దక్కనున్నాయి. ఈ నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పీసీసీ కోర్ కమిటీ కసరత్తు మొదలుపెట్టింది.



అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం నిర్వహించారు. మరోసారి సమావేశం కావాలని పీసీసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవులు కోసం పీసీసీకి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది.

## 'నీ చరిత్ర మొత్తం తెలుసు'.. అన్నందుకే శిరీషను అంతం చేసింది

హైదరాబాద్: మలక్పేటలో వివాహిత శిరీష హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు. శిరీష భర్త వినయ్ కుమార్, అతని సోదరి సరిత, మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. కేసు వివరాలను ఏసీపీ మీడియాకు వెల్లడించారు. మార్చి ఒకటో తేదీ రాత్రి వినయ్ సోదరి సరిత, శిరీష మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. నర్సుగా పనిచేస్తున్న శిరీష పలు చోట్ల ఉద్యోగాలు మానేసింది. తరచూ ఉద్యోగాలు ఎందుకు మానేస్తున్నావు, నిలకడ లేదా నీకు అని సరిత గట్టిగా నిలదీసింది. నీ చరిత్ర మొత్తం నాకు తెలుసు, నీ సంగతి తేలుస్తా అంటూ శిరీష కూడా ఎదురు దాడికి దిగడంతో పరస్పరం ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత ఎవరి గదిలోకి వారు వెళ్లిపోయారు. గొడవ తర్వాత శిరీషకు నిద్ర పట్టడం లేదని సరిత వద్ద ఉండే మత్తు ఇంజెక్షన్ అడిగింది. అప్పటికే శిరీషపై కక్ష పెంచుకున్న సరిత.. మత్తు ఇంజెక్షన్ డోసు ఎక్కువగా ఇచ్చింది. శిరీష మత్తులోకి జారుకున్న తర్వాత దిండుతో ముఖంపై



అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి చంపేసింది. మరుసటిరోజు ఉదయం తన భర్త, సోదరుడికి జరిగిన విషయం చెప్పింది. నిందితురాలిని కాపాడేందుకు వారిద్దరూ.. అంబులెన్స్ను పిలిపించి ఆసుపత్రికి తరలించారు. సహజమరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. తన గురించి భర్తకు చెడుగా చెబుతుందని భయపడిన సరిత... శిరీషను హతమార్చినట్టు దర్యాప్తులో తేలింది'' అని ఏసీపీ వివరించారు. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించటంతో చిన్న కూతురు శిరీష (32) ను కరీంనగర్కు చెందిన ఓ ప్రొఫెసర్ దత్తత తీసుకున్నారు. 2016లో నాగర్కర్నూలు జిల్లా దోమలపెంటకు చెందిన వినయ్ను శిరీష ప్రేమ వివాహం చేసుకుంది. ఈ పెళ్లి ఇష్టం లేని ప్రొఫెసర్ కుటుంబం ఆమెను దూరంగా ఉంచారు. దంపతులిద్దరూ మలక్పేటలోని జమున టవర్స్లో ఉంటున్నారు. ప్రైవేటు ఉద్యోగం చేసిన వినయ్ ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. శిరీష ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. 2019లో పాప జన్మించిందని పోలీసులు తెలిపారు.

# గ్రూప్-1 పోస్టులపై తప్పుడు ప్రచారం.. పోలీసులకు TGPSC ఫిర్యాదు




హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్- 1 ఉద్యోగాలపై తప్పుడు వార్తలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGP-SC) ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతోన్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతి త్వరలోనే గ్రూప్- 1 ఫలితాలు వెల్లడిస్తామని తెలిపింది. మార్కుల జాబితాను వెబ్సైట్లో పెడతామని.. అభ్యర్థుల లాగిన్లో పేపర్ల వారీగా మార్కులు ఉంచుతామని పేర్కొంది. గ్రూప్ -1 నియామక ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతోందని తెలిపింది. ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకున్నామనీ.. అభ్యర్థులు తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది.

# నీతీశ్ కుమార్ కూటమి మారడం ఖాయం : పీకే

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌ను ఉద్దేశించి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన కూటమి మారతారంటూ చెప్పారు. సీఎం పదవి మరోసారి చేపట్టేందుకు ఆయన ఈ మార్గాన్ని ఎంచుకోవడం ఖాయమని పీకే అన్నారు. "బిహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాతో కలిసి నీతీశ్ కుమార్ పోటీ చేస్తారు. అయితే.. ఆయన కాకుండా మరెవరైనా సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. కానీ, ముఖ్యమంత్రి పదవిపై ఆశతో ఆయన కూటమి మారే ప్రయత్నం చేయవచ్చు. నీతీశ్ ఏ కూటమిలో ఉన్నా సరే.. మరోసారి ఆయన సీఎంగా కొనసాగేందుకు ప్రజలు అంగీకరించరు. జేడీ(యూ) అధినేత పార్టీ మారడం ఖాయం. ఇది కచ్చితంగా జరుగుతుందని రాసి ఇస్తా. ఒకవేళ నేను చెప్పింది జరగపోయినట్లయితే.. రాజకీయ ప్రచారం నుంచి తప్పుకుంటా" అని విలేకరుల సమావేశంలో పీకే పేర్కొన్నారు. సీఎం అభ్యర్థిగా నీతీశ్ కుమార్‌ను ప్రకటించేందుకు భాజపా ఆసక్తి చూపడం లేదంటూ వస్తున్న ఊహాగానాలపై పీకే మాట్లాడారు.



ఎన్నికల ముందు ముఖ్యమంత్రి అభ్యర్థిగా నీతీశ్‌ను ప్రకటించాలంటూ ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాకు సవాల్ విసిరారు. ఒకవేళ అలా చేస్తే ఆ పార్టీ సీట్లు గెలవడం కష్టమవుతుందన్నారు. "జేడీ(యూ) ఎక్కువ సీట్లు గెలుచుకోలేకపోవచ్చు. నీతీశ్ చేతిలో సీఎం పదవిని పెట్టేందుకు కాషాయ పార్టీ నిరాకరించినప్పుడు ఆయన కూటమి మారేందుకు ప్రయత్నించవచ్చు. అయితే.. ఆయన ఎక్కడ ఉన్నా సరే ఉన్నత పదవి మాత్రం దక్కదు" అని అన్నారు.

## కేంద్రంపై కమల్ హాసన్ విమర్శలు

చెన్నై: డీలిమిటేషన్, త్రిభాషా విధానంపై తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే, కేంద్రంలోని భాజపా మధ్య తీవ్ర వివాదం నడుస్తోంది. దీనిపై తాజాగా మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ స్పందించారు.ఇండియాను 'హిందీయా'గా మార్చే ప్రయత్నం జరుగుతోందని కేంద్రంపై విమర్శలు చేశారు. ''అన్ని రాష్ట్రాలు హిందీలో మాట్లాడేలా చేసి, ఎన్నికల్లో మెజార్టీ సాధించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. మనం ఇండియా గురించి ఆలోచిస్తుంటే.. వారు మాత్రం హిందీయా కలలుకంటున్నారు'' అని కమల్ హాసన్ వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్, భాష అంశాలపై బుధవారం తమిళపార్టీలు సమావేశమయ్యాయి. అలాగే ఆ పార్టీలు ఆమోదించిన తీర్మానాన్ని కేంద్రానికి పంపాయి. 1971 జనాభా లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని స్టాలిన్ అభ్యర్థించారు. ఆ సమావేశంలోనే కమల్ హాసన్ మాట్లాడారు. అలాగే 2019లో ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వాడిన హిందీయా పదాన్ని ప్రస్తావించారు. అంతర్జాతీయంగా భారత్ అంటే గుర్తొచ్చే భాష హిందీనే అని ఆ ఏడాది హిందీ దివస్ రోజున అమిత్ షా పోస్టు పెట్టారు. దానిపై స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. ''ఇది ఇండియా.. హిందీయా కాదు'' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదిలా ఉంటే, ఇటీవల కమల్ హాసన్ తన పార్టీ సభ్యులతో మాట్లాడుతూ.. ''తమిళ ప్రజలు భాషకోసం ప్రాణాలకు తెగించి పోరాడారు. ఆటలొద్దు'' అని హెచ్చరించిన సంగతి తెలిసిందే. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో



పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయంటూ తమిళనాడు కొంతకాలంగా ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఇటీవల ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారు. పునర్విభజన ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాలు తగ్గవని స్పష్టం చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఈ అంశంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇక, జాతీయ విద్యావిధానంలో భాగంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేయకపోతే.. నిధులు నిలిపివేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల హెచ్చరించారు. దాంతో డీఎంకే ప్రభుత్వం తీవ్ర ఆగ్రహానికి గురైంది. కేంద్ర ప్రభుత్వం ఓపెన్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని మండిపడింది. జాతీయ విద్యావిధానాన్ని (NEP 2020) తిరస్కరించినందుకు ప్రతీకారంగా రాష్ట్రానికి రావాల్సిన రూ.వేల కోట్ల నిధులను వేరేవాటికి మళ్లించారంటూ ఆరోపణలు చేసింది. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం కూడా ఒక రాష్ట్రంపై రాజకీయ ప్రతీకారం కోసం విద్యను అడ్డుకునేంత క్రూరంగా వ్యవహరించలేదని దుయ్యబట్టింది.

## ఈ సీఎం అవసరమా..? :నీతీశ్‌పై తేజస్వీ యాదవ్ విమర్శలు

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా సీఎంపై తేజస్వీ విమర్శలు గుప్పించారు. ఆయన అసమర్థ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని వ్యాఖ్యానించారు. నీతీశ్‌ను పాత వాహనంతో పోల్చారు. అసమర్థ ప్రభుత్వం బిహార్ ప్రజలకు వద్దని కోరారు. పదవీ విరమణ వయసు 60గా ఉంటుందని, 75 ఏళ్ల సీఎం కావాలా..? అంటూ ఓ కార్యక్రమంలో ప్రజలను తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. ''సీఎం అలసిపోయారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పాత వాహనంతో ముందుకు వెళ్లలేం. సరికొత్త దృక్పథంతో అభివృద్ధి సాధించాలి. నీతీశ్ రిటైర్ అయ్యారు. ఆయనకు తన డిప్యూటీ సీఎంల పేర్లు కూడా గుర్తు లేవు. త్వరలో మా ప్రభుత్వం ఏర్పాటవుతుంది'' అని పేర్కొన్నారు. కాగా.. అసెంబ్లీలో తన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన తేజస్వీ యాదవ్‌పై నీతీశ్ కుమార్ మండిపడిన సంగతి తెలిసిందే.



గతంలో రాష్ట్ర పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ.. ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన కారణంగానే లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయాల్లో ఎదిగారని వ్యాఖ్యానించారు. ఆయనకు అండగా ఎందుకు నిలుస్తున్నారని లాలూ సొంత మనుషులే అడిగారని.. అయినా మద్దతు ఇచ్చానంటూ పేర్కొన్నారు. తాజాగా నీతీశ్‌పై లాలూ కుమారుడు తేజస్వీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## రాజీవ్ గాంధీపై కీలక వ్యాఖ్యలు..

### కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టిన మణిశంకర్ అయ్యర్

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్.. మరోసారి తన వివాదస్పద వ్యాఖ్యలతో పార్టీని ఇరుకున పెట్టారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన రెండు సార్లు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని.. అలాంటి వ్యక్తి దేశ ప్రధాని ఎలా అయ్యారోనంటూ వ్యాఖ్యానించారు. ప్రముఖ మీడియా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''నేను, రాజీవ్ గాంధీ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నాం. నాడు ఆయన పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. విశ్వవిద్యాలయం విద్యార్థులను ఉత్తీర్ణులు చేయాలనే ప్రయత్నిస్తుంది. కానీ, రాజీవ్ మాత్రం విఫలమయ్యారు. ఆ తర్వాత లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో కూడా ఫెయిల్ అయ్యారు. చదువు విషయంలో ఆయన చాలా కష్టపడ్డారు. అయినప్పటికీ ఉత్తీర్ణత సాధించలేకపోయారు. రెండు సార్లు




విఫలమై, పైలట్‌గా పని చేసిన వ్యక్తి దేశ ప్రధాని అవుతారని నేను ఊహించలేదు. ఇది ఎలా సాధ్యమైందో'' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

**భాజపా విమర్శలు..**

ఈ వీడియోను భాజపా నేత అమిత్ మాలవీయా 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. 'ఆయనను ముసుగు తొలగించనివ్వండి' అంటూ విమర్శించారు. ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మణి శంకర్ గతంలోనూ సొంత పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాజకీయాల్లో తన ఎదుగుదలకు, పతనానికి 'గాంధీ కుటుంబమే' కారణమన్నారు. పదేళ్లలో పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీతో ఒక్కసారి కూడా సమావేశం అయ్యేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కూడా ఒకటి, రెండు సార్లు మాత్రమే భేటీ అయినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చిన్న నేతలకు సరైన గుర్తింపు ఉండదన్నారు. నాడు ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయన పార్టీ మారబోతున్నారంటూ ఊహాగానాలు కూడా వచ్చాయి. ప్రస్తుతం మరోసారి ఆయన వివాదస్పద వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టినట్లయింది.



## ఎమ్మెల్యే నిర్వాకం.. గుట్కా నిషేధిస్తూ యూపీ అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం

లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఒక ఎమ్మెల్యే గుట్కా తిని కార్పెట్‌పై ఉమ్మివేయడంపై స్పీకర్ సతీశ్ మహాన ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన దీని వినియోగంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా తినడంపై నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం బడ్జెట్ సమావేశం జరగడానికి ముందు అసెంబ్లీలోకి వస్తున్న సమయంలో కార్పెట్‌పై గుట్కా గుర్తులను స్పీకర్ గమనించారు. ''ఈ నిర్వాకం చేసిన ఎమ్మెల్యే ఎవరో నాకు తెలుసు. వీడియోలో నేనంతా చూశాను. కానీ, ఎవరినీ కించపరచాలని అనుకోవడం లేదు. అందుకే వారి పేరును ప్రస్తావించను. ఎవరైన ఇకపై ఇలాంటి పని చేస్తున్నట్లయితే మిగిలిన సభ్యులు దాన్ని అడ్డుకోవాలని కోరుతున్నాను. అసెంబ్లీని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత. ఇలా చేసిన ఎమ్మెల్యే వచ్చి తప్పును అంగీకరిస్తే బాగుంటుంది. లేదంటే అతడిని నేనే పిలుస్తాను'' అని సతీశ్ మహాన హెచ్చరించారు.

**ఇదేమీ వ్యక్తిగత ఆస్తి కాదు..**

అనంతరం దగ్గరుండి కార్పెట్‌ను శుభ్రం చేయించారు. ఒక వ్యక్తి చేసిన పనికి మిగిలిన వారి గౌరవం ఎందుకు దెబ్బతినాలంటూ స్పీకర్ ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రజలకు చెందిందని.. ఇదేమీ వ్యక్తిగత ఆస్తి కాదంటూ మండిపడ్డారు. అసెంబ్లీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే.. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా, పాన్ మసాలా వినియోగించడంపై ఆయన నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 1000 జరిమానా విధించనున్నారు.

## రాహుల్ గాంధీకి రూ.200 జరిమానా.. ఎందుకంటే!

ఓ కేసు విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యాయస్థానం రూ.200 జరిమానా విధించింది. పదే పదే విచారణకు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 14న తదుపరి విచారణకు హాజరు కాకుంటే మాత్రం తీవ్ర చర్యలుంటాయని రాహుల్ గాంధీని హెచ్చరించింది. మహారాష్ట్రలో 2022లో మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. వీర్ సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుడైన వీర్ సావర్కర్‌ను కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌కు సంబంధించి తాజాగా మరోసారి విచారణ జరిగింది. రాహుల్ గాంధీ తరఫున న్యాయవాది ప్రన్షు అగర్వాల్ హాజరై.. ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బిజీగా ఉన్నారని, వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయితే, పదే పదే విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఆయనకు రూ.200 జరిమానా విధించిన అప్పర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం.. తదుపరి విచారణకు రాహుల్



తప్పకుండా హాజరు కావాలని ఆదేశించింది. లేని పక్షంలో నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేస్తామని హెచ్చరించింది.

## మణిపూర్‌లో భూ ప్రకంపనలు.. గంట వ్యవధిలోనే రెండు సార్లు కంపించిన భూమి

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌ను భూ ప్రకంపనలు వణికించాయి. గంట వ్యవధిలోనే రెండు సార్లు భూమి కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఉదయం 11:06 గంటలకు 5.7 తీవ్రతతో మొదటి భూకంపం సంభవించగా దీని భూకంప కేంద్రం ఇంఫాల్ తూర్పు జిల్లాలోని యైరిపోక్‌కు తూర్పున 44 కి.మీ దూరంలో 110 కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమై ఉంది. ఆ తర్వాత 12:20 గంటలకు 4.1 తీవ్రతతో రెండో భూకంపం సంభవించగా.. కామ్ జోంగ్ జిల్లాలో 66 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్సీఎస్) తెలిపింది. భూకంపం తర్వాత ఎటువంటి నష్టం జరిగినట్టు అధికారిక నివేదికలు లేనప్పటికీ తౌబాల్ జిల్లాలో అనేక భవనాలకు పగుళ్లు ఏర్పడినట్టు తెలుస్తోంది. ఇక్కడ ఓ పాఠశాలలో ఘర్షణల వల్ల నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పిస్తున్నారు. సోషల్ మీడియా లో దీనికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. మణిపూర్ ప్రకంపనల ప్రభావంతో అసోం, మేఘాలయాల లోని కొన్ని ప్రాంతాల్లోనూ స్వల్ప ప్రకంపనలు వచ్చినట్టు సమాచారం. కాగా, ఇప్పటికే జాతి హింసతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో ప్రకంపనలు రావడంతో ప్రజల తీవ్ర భయాందోళనకు గురయ్యారు.




# పసుపు.. కారంతో.. మహిళల విజయం

అది సిద్దిపేట నియోజకవర్గం పరిధిలో ఉండే మిట్టపల్లి గ్రామం. అక్కడి మహిళలు.. గత ప్రభుత్వం అందించిన సాయాన్ని తమ ఉపాధిగా మార్చుకున్నారు. గ్రామానికి చెందిన 11 మంది మహిళలు రెండు గ్రూపులుగా ఏర్పడ్డారు. వాటి పేరు దుర్గాభవాని, శ్రీరామ. 2021 జనవరిలో శ్రీరామ, దుర్గాభవాని గ్రూపులు పసుపు, కారం పొడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను స్థాపించారు. వ్యాపారంలోకి అడుగుపెట్టాలనే లక్ష్యంతో మొదట ఒక్కో సభ్యురాలు రూ.15వేల చొప్పున జమ చేసుకున్నారు. పావలా వడ్డీ కింద బ్యాంకు నుంచి సుమారు రూ.47 లక్షల రుణం తీసుకున్నారు. ఆ మొత్తంతో పసుపు, కారం పొడి తయారీకి కావాల్సిన యంత్రాలను, ఇతర సామగ్రిని కొన్నారు. ఒక షెడ్ ఏర్పాటు చేసుకున్నారు. నాణ్యమైన పసుపు, కారంపొడి తయారుచేసి స్వయంగా ప్యాకింగ్ చేసి సిద్దిపేట రైతుబజారులో ఒక స్టాల్ ఏర్పాటు చేసి అమ్ముతున్నారు.





**వేతనం తీసుకుని...**

ఈ మహిళలు రోజుకు రూ.250 చొప్పున నెలకు ఒకసారి వేతనం తీసుకుంటారు. మిగిలిన డబ్బును బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తారు. ఈ మొత్తం నుంచి ముడిసరుకు కొంటారు. బ్యాంకు రుణం తీరాక లాభాలు పంచుకుంటారట.

**స్ఫూర్తిగా...**

ఈ స్ఫూర్తితో చుట్టు పక్కల జిల్లాలకు చెందిన మహిళలు మిట్టపల్లికి వచ్చి ఈ మహిళలను చూసి తెలుసుకుంటున్నారు. కారం పొడి తయారీకి వరంగల్ ఎనుమాముల మార్కెట్ నుంచి ఎండు మిర్చి కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నాణ్యమైన మిర్చి దొరుకుతుందని తెలిస్తే.. అక్కడి నుంచి తెప్పించుకుంటున్నారు. నిజామాబాద్ మార్కెట్ నుంచి పసుపు కొమ్ములు తెస్తున్నారు. ఒకేసారి 1015 క్వింటాళ్ల వరకు మిర్చిని కొనుగోలు చేస్తారు. దానిని బాగా ఎండబెట్టి, కూలీలతో తొడిమెలు తీయించి.. కారం పొడి తయారీ చేస్తున్నారు. కిలో కారం పొడి రూ.300, కిలో పసుపు రూ.260కి విక్రయిస్తున్నారు. ప్రతి రోజు సుమారు 20 కిలోల చొప్పున పసుపు, కారం పొడి అమ్ముతూ లాభాలు తెచ్చుకుంటున్నారు.



# బాల్కనీలో మొక్కల కోసం..

ఈ మధ్య బాల్కనీలో మొక్కలు పెంచుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. ఐతే పెంచుకుంటే సరికాదు.. వాటి నిర్వహణ కూడా ముఖ్యమే. మరి ఈ వానకాలంలో బాల్కనీలో మొక్కల గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అంటే... సాధారణంగా వానకాలం మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కానీ, ఇండోర్ ప్లాంట్స్‌కు మాత్రం ఈ కాలం ఇబ్బంది పెట్టేస్తుంది. కాబట్టి ఈ టిప్స్ పాటించండి.





- సహజంగా ఇండోర్ ప్లాంట్స్‌కు నీరు తక్కువ అవసరం. అందుకని నీరు ఎక్కువగా పోయకూడదు. ఎందుకంటే మొక్కలకు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది. చల్లటి వాతావరణంలో నీరు ఇంకిపోవడానికి చాలా సమయం పడుతుంది. దీంతో తరచూ నీళ్లు పోస్తే.. వేళ్లు కుళ్లిపోయి మొక్క చనిపోయే ప్రమాదం ఉంది.
- ఇండోర్ ప్లాంట్స్ ఆరోగ్యంగా ఉండాలంటే సూర్యరశ్మి చాలా అవసరం. వానాకాలం ఇంట్లోకి వెలుతురు సరిగా రాకపోవచ్చు. మొక్కల కుండీలను కిటికీల దగ్గర ఉంచితే బెటర్.
- శుభ్రంగా ఉంచడం ఎంతో ముఖ్యం. ఆకులపై దుమ్ము పేరుకుపోతే వాటిపై ఉండే రంధ్రాలు మూసుకుపోయే అవకాశం ఉంటుంది. వడలిపోయిన లేదా కుళ్లిన ఆకులను మొక్క నుంచి తుంచేయాలి. ఆకులపై ఉండే దుమ్మును శుభ్రం చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ సక్రమంగా జరిగి మొక్క బాగా పెరుగుతుంది.

# మష్రూమ్ కాఫీ టేస్ట్ చేశారా..

ఈ చల్లని వాతావరణానికి వేడివేడి కాఫీ గొంతులోకి దిగుతుంటే హాయిగా ఉంటుంది.మెదడును ఉత్తేజపరచడంలో కాఫీ ఔషధంగా పనిచేస్తుంది. ఐతే కాఫీల్లో చాలా రకాలు ఉన్నాయి. వాటిలో మష్రూమ్ కాఫీ కూడా ఉంది.

- సహజంగా ఇండోర్ ప్లాంట్స్‌కు నీరు తక్కువ అవసరం. అందుకని నీరు ఎక్కువగా పోయకూడదు. ఎందుకంటే మొక్కలకు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది. చల్లటి వాతావరణంలో నీరు ఇంకిపోవడానికి చాలా సమయం పడుతుంది. దీంతో తరచూ నీళ్లు పోస్తే.. వేళ్లు కుళ్లిపోయి మొక్క చనిపోయే ప్రమాదం ఉంది.
- ఇండోర్ ప్లాంట్స్ ఆరోగ్యంగా ఉండాలంటే సూర్యరశ్మి చాలా అవసరం. వానాకాలం ఇంట్లోకి వెలుతురు సరిగా రాకపోవచ్చు. మొక్కల కుండీలను కిటికీల దగ్గర ఉంచితే బెటర్.
- శుభ్రంగా ఉంచడం ఎంతో ముఖ్యం. ఆకులపై దుమ్ము పేరుకుపోతే వాటిపై ఉండే రంధ్రాలు మూసుకుపోయే అవకాశం ఉంటుంది. వడలిపోయిన లేదా కుళ్లిన ఆకులను మొక్క నుంచి తుంచేయాలి. ఆకులపై ఉండే దుమ్మును శుభ్రం చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ సక్రమంగా జరిగి మొక్క బాగా పెరుగుతుంది.



**తయారీ ఇలా...**

మష్రూమ్ పౌడర్ సూపర్ మార్కెట్, ఆన్‌లైన్‌లోనూ లభిస్తుంది. చక్కెర, ఇన్‌స్టంట్ కాఫీ పౌడర్, పాలు కలిపి ఆ తర్వాత మష్రూమ్ పౌడర్ కలిపితే.. మష్రూమ్ కాఫీ రెడీ.

# ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు న్యూజిలాండ్..

### దక్షిణాఫ్రికాపై 50 పరుగుల తేడాతో విన్..




**లాహోర్:** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లోకి న్యూజిలాండ్ ప్రవేశించింది. ఈ నెల 9న భారత్‌తో ఫైనల్‌లో తలపడనున్నది. లాహోర్ గడాఫీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. కివీస్ నిర్దేశించిన 363 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 312 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో కేవలం డేవిడ్ మిల్లర్ మాత్రమే సెంచరీతో ఆకట్టుకున్నాడు.

లాహోర్ స్టేడియంలో జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 362 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (108), కేన్ విలియమ్సన్ (102) రాణించారు. అలాగే, డారిల్ మిచేల్ (49), గ్లెన్ ఫిలిప్స్ (49) ధాటిగా బ్యాటింగ్ చేయడంతో న్యూజిలాండ్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడీకి మూడు, కగిసో రబడా రెండు వికెట్లు, వియాన్ ముల్డర్‌కు ఓ వికెట్ దక్కింది.

భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా మొదట ఇన్నింగ్స్‌ను స్లోగా ప్రారంభించింది. తర్వాత రియాన్ రికిల్టన్ కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 12 బంతుల్లో నాలుగు ఫోర్ల సహాయంతో 17 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత రాస్సీ వాన్ డెర్ డస్సెన్‌తో కలిసి కెప్టెన్ టెంబా బావుమా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. బావుమా 71 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 56 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. రెండో వికెట్‌కు ఇద్దరు 105 పరుగులు జోడించారు. మరో వైపు డస్సెన్ 66 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 69 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత మార్కరమ్ (36) పర్వాలేదనిపించినా.. క్లాసెన్ (3) తక్కువ స్కోర్‌కే అవుట్ అయ్యాడు. ఓ వైపు కివీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ.. దక్షిణాఫ్రికా బ్యాటర్లకు హిట్టింగ్‌కు ఛాన్స్ ఇవ్వలేదు.

ఓ వైపు వికెట్లు టపాటపా పడడంతో ఓటమి దిశగా కదిలింది. ముల్డర్ (8), కేశవ్ మహరాజ్ (1), రబాడా (16) పరుగులకే వెనుదిరిగారు. చివరలో డేవిడ్ మిల్లర్ సెంచరీతో చివరి వరకు ఒంటరి పోరాటం చేశాడు. కేవలం 67 బంతుల్లో పది ఫోర్లు, నాలుగు సిక్సర్ల సహాయంతో సెంచరీ నమోదు చేశాడు. డేవిడ్ మిల్లర్ రాణించడంతో దక్షిణాఫ్రికా కనీసం 300 స్కోర్ చేయగలిగింది. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్‌కు మూడు, గ్లెన్ ఫిలిప్‌కు రెండు, మాట్ హెన్రికి రెండు, బ్రాస్‌వెల్, రచిన్ రవీంద్రాకు తలో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో పాటు బంతితో రాణించిన రచిన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.




## మార్కెట్‌కు ఎలక్ట్రిక్ కిక్..
## అదరగొడుతున్న కొమాకి నయా ఈవీ స్కూటర్



**న్యూఢిల్లీ:** ప్రముఖ ఈవీ కంపెనీ కొమాకీ తాజాగా ఎక్స్-3 పేరుతో కేవలం రూ.52,999 ధరతో కొత్త ఈవీ స్కూటర్‌ను లాంచ్ చేసింది. ఈ స్కూటర్ హై-స్పీడ్ ఎలక్ట్రిక్ స్కూటర్ అని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఎక్స్-3 ఎస్‌ఈ, ఎక్స్- వన్, ఎంజీ సిరీస్ వేరియంట్స్‌లో ఎలక్ట్రిక్ స్కూటర్లు అందుబాటులో ఉన్నాయి. కొమాకీ ఈవీ బై-2 ఏ 999 అనే ఆఫర్‌ను కూడా అందుబాటులో ఉంచింది. ముఖ్యంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. ఎక్స్-3 స్కూటర్ భారతదేశంలోని కొమాకీ అధీకృత డీలర్స్ వద్ద అలాగే ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్స్‌లో అందుబాటులో ఉంటుందని కోమాకి పేర్కొంది. కోమాకి ఎక్స్-3 స్కూటర్ ఆకట్టుకునే డిజైన్‌తో వస్తుంది. అలాగే ఈ ఫుల్ ఎల్‌ఈడీ లైటింగ్ సెటప్ ఆకట్టుకుంటుంది.ఈ స్కూటర్‌లో డ్యూయల్ ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్స్, ఎల్‌ఈడీ టర్న్ ఇండికేటర్లతో పాటు డిజిటల్ డాష్ బోర్డ్, మల్టిపుల్ రైడింగ్ మోడ్స్, పార్కింగ్ రిపేర్ అసిస్ట్, రివర్స్ అసిస్ట్ మొదలైన ఫీచర్లు ఆకర్షిస్తున్నాయి. ఈ స్కూటర్ మూడు వేర్వేరు రంగు ఎంపికల్లో లభిస్తుంది. గార్నెట్ రెడ్, సిల్వర్ గ్రే, జెట్ బ్లాక్ రంగుల్లో కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. కోమాకి ఎక్స్-3 స్కూటర్‌లో లిథియం-అయాన్ బ్యాటరీ ప్యాక్, 3 కేడబ్ల్యూ ఎలక్ట్రిక్ మోటారుతో రావడం వల్ల ఓ సారి ఫుల్‌గా ఛార్జ్ చేస్తే 100 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. అలాగే ఈ స్కూటర్ గంటకు 55 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుంది.

కోమాకి ఎక్స్-3 ఎలక్ట్రిక్ స్కూటర్ ఆవిష్కరణ సందర్భంగా కోమాకి ఎలక్ట్రిక్ వెహికల్స్ సహ వ్యవస్థాపకురాలు గుంజన్ మల్హోత్రా మాట్లాడుతూ ఈ ఎలక్ట్రిక్ వాహనాలను మహిళా రైడర్ల అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా రూపొందించామని చెప్పారు. ఈ కొత్త ఎక్స్-3 సిరీస్‌ను ప్రారంభించడం అనేది దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాల విప్లవాన్ని నడిపించడంలో మరో మైలురాయిగా పరిగణించవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు నూతన వేరియంట్స్‌లో ఈవీ స్కూటర్లను లాంచ్ చేస్తున్నామని వివరించారు. . మహిళా రైడర్ల అవసరాలను తీర్చడానికి ఎక్స్-3 వేరింయట్‌ను ప్రత్యేకంగా రూపొందించామని స్పష్టం చేశారు.

## స్టాక్ ట్రేడింగ్‌లో నష్టాలకు చెక్..

### పేటీఎంలో కొత్త ఫీచర్..!



**ముంబై:** ప్రస్తుతం స్టాక్ మార్కెట్ విపరీతంగా విస్తరించింది. ప్రతి ఒక్కరూ దానిలో పెట్టుబడులు పెడుతున్నారు. పేటీఎం కొత్త ఫీచర్ తో బ్రోకరేజ్ యాప్ లలో ట్రేడింగ్ చేస్తున్నప్పుడు స్టాక్ ట్రేడర్లు తమ బ్యాంక్ ఖాతాలో నిధులను నేరుగా బ్లాక్ చేసుకోవచ్చు. దీనివల్ల ట్రేడింగ్ ఖాతాలకు పెద్ద మొత్తాలను బదిలీ చేయనవసరం ఉండదు. బ్రోకర్లు డబ్బులను బదిలీ చేయడానికి బదులుగా వ్యాపారులు తమ ఖాతాలో నిధులను బ్లాక్ చేస్తారు.

పేటీఎంగా పిలిచే వన్ 97 కమ్యూనికేషన్ లిమిటెడ్ తీసుకువచ్చిన యూటీఐ ట్రేడింగ్ బ్లాక్ ఫీచర్ ను సింగిల్ బ్లాక్ మల్టిఫుల్ డెబిట్స్ అని క్డూడా పిలుస్తారు. దీని వల్ల స్టాక్ ట్రేడర్లకు బ్రోకింగ్ అనుభవం సులభతరం అవుతుంది. బ్లాక్ చేసిన డబ్బు వినియోగదారుడి ఖాతాలోనే ఉంటుంది. ట్రేడ్ జరిగే వరకూ దాని మీద వడ్డీ అందుతుంది. ట్రేడింగ్ పూర్తయిన తర్వాత యూపీఐ పిన్ అవసరం లేకుండానే అవసరమైన మొత్తాన్ని తీసుకుంటుంది.

## కార్ల మార్కెట్‌కు కొత్త కళ..



**న్యూఢిల్లీ:** భారత ఆటో మొబైల్ పరిశ్రమకు ఈ ఏడాది మంచి ఆరంభం లభించింది. మొదటి రెండు నెలల్లోనే మంచి విజయాలు నమోదు చేసింది. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్ పో 2025 ను ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా గమనించింది. దేశ, విదేశాలకు చెందిన పలు కంపెనీలు తమ కొత్త ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఫిబ్రవరిలో అనేక కొత్త కార్లు మార్కెట్ లోకి విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో మార్చి నెలలో కూడా కొన్ని కొత్త కార్లు రానున్నాయి.

### మారుతీ సుజుకి ఇ-విటారా

మారుతీ సుజుకి తయారు చేసిన ఎలక్ట్రిక్ ఎస్ యూవీ అయిన ఇ-విటారా మార్చిలో మార్కెట్ లోకి అందుబాటులోకి రానుంది. ఈ కారు ఇప్పటికే డీలర్ల వద్దకు చేరుకుంది. ఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్ పో లో ఈ కారును ప్రదర్శనకు ఉంచారు. గుజరాత్ లోని కంపెనీ ప్లాంట్ లో ఉత్పత్తి మొదలైంది. ఇక్కడి నుంచి ప్రపంచంలోని 100కి పైగా దేశాలకు ఈ కారును ఎగుమతి చేయనున్నారు. ఇ-విటారా కారు 49 కేడబ్ల్యూహెచ్, 61 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎంపికలతో అందుబాటులోకి వచ్చింది. 61 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ మోడల్ సింగిల్ చార్జింగ్ పై 500 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. వీటకి జత చేసిన సింగిల్ మోటారు నుంచి 144 హెచ్ పీ, 174 హెచ్ పీ శక్తి విడుదలవుతుంది. అలాగే 189 ఎన్ఎం గరిష్ట టార్కును విడుదల చేస్తాయి. వైర్ లెస్ చార్జింగ్ ప్యాడ్, రెండు స్పోక్ స్టీరింగ్ వీల్స్, బ్రష్ట్ సిల్వర్ సరౌండ్ లతో కూడిన ఏసీ వెంట్లు, రోటరీ డ్రైవ్ స్టేట్ సెలెక్టర్, లెవెల్ 2 అడాస్, ఏడు ఎయిర్ బ్యాగులు తదితర ప్రత్యేకతలు ఉన్నాయి.

### మెర్సిడెస్ మేబ్యాక్ ఎస్ఎల్

మెర్సిడెస్ మేబ్యాక్ ఎస్ఎల్ 680 మోనోగ్రామ్ సిరీస్ కారు మార్చి 17వ తేదీన మార్కెట్ లోకి రానుంది. ఈ కారు స్టైలిష్ లుక్ తో అదరగొడుతోంది. కాంతివంతమైన నిలువు స్లాట్, సొగసైన ఫ్రంట్ గ్రిల్, మేబ్యాక్ లోగోలతో కూడి అబ్సిడియర్ బ్లాక్ బో నెల్, గార్నెట్ రెడ్ షేడ్ ఆకట్టుకుంటున్నాయి. ఎస్ఎల్ 680 మే బ్యాక్ ఎక్స్ క్యూజివ్ మల్టీ స్పోక్ అల్లాయ్ వీల్స్, వెనుక భాగంలో బ్లాక్ ఫినిష్డ్ వింగ్ మిర్రర్, ఆధునాతన బంపర్ డిజైన్ బాగున్నాయి. ఈ కొత్త కారు ఎస్ఎల్ 63 మాదిరిగానే కనిపిస్తుంది. కానీ దానికంటే ఎక్కువ శక్తిని అందిస్తుంది. దీనిలో 4.0 లీటర్ ట్విన్ టర్బో వీ8 ఇంజిన్ నుంచి 585 హెచ్ పీ, 800 ఎన్ఎం టార్కు విడుదల అవుతుంది. ఇంజిన్ కు 9 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ జత చేశారు. కేవలం 4.1 సెకన్లలో సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది.

### 2025 వాల్వో ఎక్స్ సీ 90

2025 వాల్వో ఎక్స్ సీ 90 కారు కూడా మార్చిలో అందుబాటులోకి వస్తుంది. పాత మోడల్, అదే ఇంజిన్ ను కొత్త కారులో ఏర్పాటు చేశారు. అయితే కొత్త ఫీచర్లు చేర్చడంతో పాటు డిజైన్ పరంగా పలు మార్పులు తీసుకువచ్చారు. వీటిలో ముఖ్యంగా ఆకట్టుకునే గ్రిల్, బంపర్ కు రెండు వైపులా నిలువుగా అమర్చిన ఎయిర్ వెంట్లు, అప్ డేట్ చేసిన థోర్స్ హామర్ ఎల్ఈడీ హెడ్ లైట్లు, కొత్త అల్లాయ్ వీల్స్ ఏర్పాటు చేశారు. ఫీచర్ల విషయానికి వస్తే ఓటీఏ నవీకరణలతో 11.0 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్ మెంట్ సిస్టమ్, గూగుల్ ఆధారిత యూఐ, డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్, మల్టీ జోన్ క్లైమెట్ కంట్రోల్ బాగున్నాయి. 2.0 లీటర్ల 4 సిలిండర్ టర్బో పెట్రోలు ఇంజిన్ నుంచి 250 హెచ్ పీ పవర్, 360 ఎన్ ఎం టార్కు విడుదల అవుతుంది. దీనికి 8 స్పీడ్ ఆటోమేటిక్ గేర్ బ్యాక్స్ జత చేశారు.

## టేబుల్ టెన్నిస్ ప్లేయర్ శరత్ కమల్ సంచలన నిర్ణయం

**చెన్నై:** టేబుల్ టెన్నిస్ ఆటగాడు ఏ శరత్ కమల్ తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకనున్నారు. చెన్నైలో ఈ నెల చివరలో జరగనున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీనే చివరిదని ప్రకటించాడు. ప్రొఫెషనల్ అథ్లెట్‌గా చివరి టోర్నమెంట్ ఆడనున్నట్లు శరత్ కమల్ తెలిపాడు. సుమారు రెండు దశాబ్ధాల పాటు టేబుల్ టెన్నిస్ క్రీడలో.. టాప్ ఇండియన్ ప్లేయర్‌గా శరత్ కమల్ తన ప్రస్థానాన్ని కొనసాగించాడు. చెన్నైలో మార్చి 25 నుంచి 30వ తేదీ వరకు వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ జరగనున్నది.

నా తొలి అంతర్జాతీయ టోర్నీని చెన్నైలోనే ఆడానని, ఇక నా చివరి అంతర్జాతీయ టోర్నీని కూడా చెన్నైలో ఆడనున్నట్లు శరత్ కమల్ చెప్పాడు. ఇదే తన చివరి ప్రొఫెషనల్ టోర్నీ అని 42 ఏళ్ల టీటీ ప్లేయర్ స్పష్టం చేశాడు. కామన్‌వెల్త్ క్రీడల్లో శరత్ కమల్ ఆరు బంగారు పతకాలు గెలిచాడు. ఇక ఏషియన్ గేమ్స్‌లో రెండు సార్లు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాడు. గత ఏడాది పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లోనూ శరత్ కమల్ పాల్గొన్నాడు. అతను అయిదు సార్లు ఒలింపిక్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

కామన్‌వెల్త్ గేమ్స్, ఏషియన్ గేమ్స్‌లో సాధించిన పతకాలు తన వద్ద ఉన్నాయని, కానీ



ఒలింపిక్ మెడల్ లేదన్నాడు. టేబుల్ టెన్నిస్ కెరీర్‌ను ఎంచుకున్న యువత రాబోయే కాలంలో ఒలింపిక్ మెడల్ గెలువాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరల్డ్ ర్యాంకింగ్స్‌లో శరత్ కమల్ 42వ స్థానంలో ఉన్నాడు. ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ప్రకారం భారత్‌లో హయ్యెస్ట్ ర్యాంక్ ప్లేయర్ శరత్ కమలే.

## శ్రేయాస్ అయ్యర్‌కు ఫీల్డర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు..

**దుబాయి:** చాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీఫైనల్లో ఇండియా గ్రాండ్ విక్టరీ కొట్టిన విషయం తెలిసిందే. 4 వికెట్ల తేడాతో కంగారూలను మట్టికరిపించి.. ఫైనల్లో దూసుకెళ్లింది రోహిత్ సేన. అయితే ఈ మ్యాచ్‌లో అద్భుతమైన ఫీల్డింగ్ ప్రదర్శించిన శ్రేయాస్ అయ్యర్‌కు ఫీల్డర్ ఆఫ్ ద మ్యాచ్ మెడల్‌ను బహూకరించారు. మాజీ క్రికెటర్, మాజీ కోచ్, కామెంటేటర్ రవిశాస్త్రి.. ఆ మెడల్‌ను అయ్యర్‌కు అందజేశాడు. ఆస్ట్రేలియా బ్యాటర్ అలెక్సీ క్యారీని.. అయ్యర్ ఔట్ చేశాడు. అద్భుతమైన రీతిలో డైరెక్ట్ త్రో వేయడంతో.. క్యారీ రనౌట్ అయ్యాడు. అతను ఔట్ కావడం వల్ల.. ఆస్ట్రేలియాను తక్కువ స్కోర్‌కు నిలువరించాల్సి వచ్చింది. క్యారీని రనౌట్ చేయడం వల్ల.. చివర్లో కనీసం 20 పరుగల్ని సేవ్ చేసినట్లు క్రికెట్ నిపుణులు అంచనా వేశారు.

అలెక్సీ క్యారీ 61 రన్స్ చేసి ఔటయ్యాడు. ఇన్నింగ్స్ 48వ ఓవర్ తొలి బంతికి.. బ్యాక్‌వర్డ్ స్క్వేర్ దిశలో బంతిని కొట్టి .. రెండు పరుగుల కోసం క్యారీ ప్రయత్నించాడు. అయితే డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ నుంచి వేగంగా పరుగెత్తుకొచ్చిన అయ్యర్ .. చేతుల్లోకి బంతిని తీసుకుని నేరుగా వికెట్లకు విసిరేశాడు. బుల్లెట్



వేగంతో వచ్చిన ఆ త్రోకు క్యారీ రనౌట్ అయ్యాడు. దీంతో ఆస్ట్రేలియా స్కోరును కొంత వరకు నిలువరించారు. క్యారీ ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, ఓ సిక్సర్ ఉన్నాయి. స్టీవ్ స్మిత్‌తో కలిసి 54 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

శ్రేయాస్ అయ్యర్ బ్యాటింగ్‌లోనూ కీ రోల్ ప్లే చేశాడు. రెండు వికెట్లు పడిన తర్వాత .. కోహ్లీతో కలిసి కీలక భాగస్వామ్యాన్ని అందించాడు. ఈ ఇద్దరి మధ్య 91 రన్స్ భాగస్వామ్యం ఏర్పడింది. ఈ మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ 62 బంతుల్లో 45 రన్స్ చేసి ఔటయ్యాడు. దాంట్లో మూడు బౌండరీలు ఉన్నాయి. మ్యాచ్ గెలిచిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లు ఫుల్ ఎంజాయ్ చేశారు.

## ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో పరాజయం...
## రిటైర్మెంట్ ప్రకటించిన ఆసీస్ స్టార్ ప్లేయర్

### వన్డే క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన స్టీవ్ స్మిత్

**దుబాయి:** ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ స్టీవ్ స్మిత్ వన్డే క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. మంగళవారం నాడు దుబాయ్‌లో భారత్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్‌లో ఈ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ఆడాడు. ఆస్ట్రేలియా తరఫున 73 పరుగులతో టాప్ స్కోరర్‌గా కూడా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ఆసీస్ ఓటమి పాలైంది. కాగా, ఛాంపియన్స్ ట్రోఫీకి స్మిత్ జట్టుకు సారథ్యం వహించిన విషయం తెలిసిందే. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చీలమండ గాయంతో టోర్నీ నుంచి తప్పుకోవడంతో స్మిత్‌కు తాత్కాలికంగా కెప్టెన్సీ దక్కింది. 35 ఏళ్ల స్టీవ్ స్మిత్ ఆస్ట్రేలియా తరఫున మొత్తం 170 వన్డేలు ఆడాడు. 86.96 స్ట్రైక్ రేట్, 43.28 సగటుతో 5,800 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వన్డేల్లో ఆస్ట్రేలియా తరఫున



అత్యధిక పరుగులు చేసిన 12వ ఆటగాడిగా తన కెరీర్‌ను ముగించాడు. ఇక వన్డేల్లో స్మిత్ అత్యధిక వ్యక్తిగత స్కోరు 164. 2016లో న్యూజిలాండ్‌పై ఈ స్కోరును నమోదు చేశాడు. లెగ్ స్పిన్నింగ్ ఆల్‌రౌండర్‌గా అరంగేట్రం చేసిన అతను 28 వికెట్లు కూడా తీసుకున్నాడు. అలాగే 90 క్యాచ్‌లు పట్టాడు. 2015, 2023లో ఆస్ట్రేలియా వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో స్మిత్ సభ్యుడు. మైఖేల్ క్లార్క్ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన తర్వాత అతను 50 ఓవర్ల జట్టుకు పగ్గాలు అందుకున్నాడు. 64 మ్యాచ్‌లలో ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించాడు. స్మిత్ నాయకత్వంలో ఆసీస్ 32 మ్యాచ్‌లలో గెలిచి, 28 మ్యాచ్‌లలో ఓడిపోయింది. నాలుగు మ్యాచ్‌లలో ఫలితం రాలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్ ఓటమి తర్వాత స్మిత్ తన సహచరులతో వన్డేల నుంచి వెంటనే రిటైర్ అవుతున్నానని చెప్పినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మీడియాకు తెలిపింది. అయితే, అతడు టెస్ట్ క్రికెట్, టీ20లకు మాత్రం అందుబాటులో ఉంటాడని పేర్కొంది.

# 'అనైరా గుప్తా' అందాల సెగలు

టాకీస్: మత్తెక్కించే అందాలతో మాయ చేస్తుంది అనైరా గుప్తా. రోజు రోజుకు ఈ బ్యూటీ చేస్తున్న రచ్చ అంతా ఇంతా కాదు. సోకులన్నీ ప్రదర్శించేస్తూ.. తన అంద చందాలతో మాయ చేస్తుంది. తాజాగా సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఫిక్స్ వైరల్ అవుతున్నాయి. హాట్ హాట్ ఫోజులతో కుర్రకారును టెంప్ట్ చేస్తుంది అనైరా గుప్తా.. అందాల వడ్డింపులో ఈ బ్యూటీ ఏ మాత్రం తగ్గడం లేదు. ఆమె అనేక ప్రఖ్యాత బ్రాండ్లకు మోడల్‌గా పనిచేసింది. మోడలింగ్ రంగంలో తనదైన ముద్ర వేసిన తర్వాత, అనైరా నటనపై దృష్టి సారించింది. ఆమె తన నటనా ప్రయాణాన్ని 2022లో విడుదలైన హిందీ చిత్రం "రన్‌వే 34"తో ప్రారంభించింది. ఈ చిత్రంలో ఆమె ప్రముఖ నటుడు అజయ్ దేవగన్ సరసన నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. తొలి సినిమాతోనే తనదైన ముద్ర వేసింది. రన్‌వే 34" తర్వాత అనైరా గుప్తా తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఆమె 2023లో విడుదలైన "బాయ్‌ఫ్రెండ్ ఫర్ హైర్" చిత్రంలో ప్రధాన పాత్ర పోషించింది. ఈ సినిమాలో ఆమె విశేషమైన నటనను కనబరిచింది. ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. అనైరా గుప్తా తన నటనతోనే కాకుండా తన అందంతో కూడా ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. ఆమె చక్కటి రూపం, అందమైన కళ్ళు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. సోషల్ మీడియాలో కూడా ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఆమె తన అభిమానులతో నిత్యం టచ్‌లో ఉంటూ, తన సినిమా విశేషాలను పంచుకుంటుంది.







## కల్యాణ్‌రామ్ సినిమాలో
## కీలక పాత్రలో విజయశాంతి

టాకీస్: నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. విజయశాంతి కీలక పాత్రలో కనిపిస్తారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ విలన్ రోల్ పోషిస్తున్నారు. ఈ సినిమాకు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్





పరిశీలనలో ఉంది. ఇందులో విజయశాంతి పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారని సమాచారం. కొన్నేళ్ల గ్యాప్ తర్వాత ఆమె మహేశ్ నటించిన సరిలేరు నీకెవ్వరూ' సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చారు. తదుపరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో కీలక పాత్ర చేయడానికి అంగీకరించారు. ముప్పా వెంకయ్య చౌదరి, సునీల్ బలుసు, అశోక్ వర్ధన్, కల్యాణ్ రామ్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు అందిస్తున్నారు.

## 'అనసూయ' ఏజ్ లెస్ బ్యూటీ

టాకీస్: టాలీవుడ్‌లో యాంకర్‌గా మొదలై, తన టాలెంట్‌తో స్టార్ హోస్ట్‌గా మారిన అమ్మడు అనసూయ భరద్వాజ్. రియాలిటీ షోలు, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు అంటూ విభిన్నమైన ప్రాజెక్టులతో ఆకట్టుకుంటూ వస్తోంది. ఇదే క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తన ఫోటోలు గట్టిగానే వైరల్ అవుతున్నాయి. కొత్తగా ట్రై చేసిన అవుట్‌ఫిట్‌తో మరింత స్టైలిష్‌గా కనిపిస్తూ, ఫ్యాషన్ విషయంలో ట్రెండ్ సెట్టర్ అనిపించుకుంటోంది. పింక్ కలర్ వెస్టన్ డ్రెస్‌లో అనసూయ రాజసంగా మెరిసిపోతూ, నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఈ డ్రెస్సింగ్‌కు మ్యాచింగ్‌గా చేసిన మేకప్, హెయిర్‌స్టైల్ ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ఫొటోషూట్‌లో అనసూయ చూపించిన ఎక్స్‌ప్రెషన్స్ మరింత హైలైట్‌గా నిలిచాయి. ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలపై నెటిజన్లు భారీగా స్పందిస్తూ, ఏజ్ లెస్ బ్యూటీ, అసలైన క్వీన్ అనసూయ.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అనసూయ గ్లామర్, స్టైల్ విషయంలో ఎప్పటికప్పుడు కొత్త ఎక్స్పరిమెంట్స్ చేస్తూ, ట్రెండ్ క్రియేట్ చేస్తుంటుంది. ఈ ఫోటోషూట్ కూడా అందులో భాగమే. ముఖ్యంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అనసూయ, తన స్టన్నింగ్ లుక్స్‌తో నెటిజన్లకు కనువిందు అందిస్తోంది. ఈ ఫోటోలు ట్రెండింగ్‌లో నిలుస్తుండటంతో, మరిన్ని అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. కెరీర్ పరంగా అనసూయ ప్రస్తుతం సినిమాలు, వెబ్‌సిరీస్‌లు రెండింట్లోను బిజీగా ఉంది. ఇటీవల ఆమె నటించిన పుష్ప 2 లోని దాక్షాయణి క్యారెక్టర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అంతేకాదు, పలు క్రేజీ ప్రాజెక్టులు కూడా లైన్‌లో ఉన్నాయి. త్వరలో విడుదల కానున్న హరిహర వీరమల్లు ప్రాజెక్ట్‌లోనూ ఆమె స్పెషల్ సాంగ్ లో హైలెట్ కానుంది. అలాగే తమిళంలో రెండు సినిమాలతో బిజీగా ఉంది.




## మత్తెక్కించే చూపులతో మాయ చేస్తున్న 'ఆషికా రంగనాథ్'

టాకీస్: ఎప్పుడూ చీరకట్టులో వయ్యారాలన్నీ ఒలకబోస్తూ ఉండే ఆషికా రంగనాథ్ రూటు మార్చేసింది. తాజాగా ఫొటో షూట్‌లో సొగసులన్నీ వడ్డించేస్తూ.. రచ్చ చేస్తుంది. పరువాలన్నీ ప్రదర్శించేస్తూ.. చిత్తు చేస్తుంది. మత్తెక్కించే చూపులతో మాయ చేస్తుంది ఆషికా రంగనాథ్.

వరుస సినిమా ఆఫర్సత్‌తో ఉన్న ఈ బ్యూటీ చేతితో ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ చిత్రాలు ఉన్నాయి. ఆషికా రంగనాథ్ 1996 ఆగస్టు 5న కర్ణాటకలోని తుముకూరులో జన్మించింది. ఆమె కుటుంబం మధ్యతరగతికి చెందినది. ఆషికా విద్యాభ్యాసం బెంగళూరులో జరిగింది. చిన్నప్పటి నుండి నటనపై ఆసక్తి ఉన్న ఆషికా, పాఠశాల మరియు కళాశాల స్థాయిలోనే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేది. ఆషికా రంగనాథ్ మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది.

అనేక వాణిజ్య ప్రకటనలలో ఫ్యాషన్ షోలలో పాల్గొన్న తర్వాత, ఆమె సినీ రంగంలోకి అడుగుపెట్టింది. 2016లో విడుదలైన కన్నడ చిత్రం "క్రేజీ బాయ్" ద్వారా ఆమె సినీ రంగ ప్రవేశం చేసింది. ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. కన్నడలో మంచి గుర్తింపు తెచ్చుకున్న తర్వాత, ఆషికా తెలుగు సినీ రంగంలోకి ప్రవేశించింది. 2022లో విడుదలైన "అమిగోస్" చిత్రం ద్వారా ఆమె తెలుగు తెరకు పరిచయమైంది. సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు తన ఫిక్స్ చేస్తూ .. అభిమానులను ఫిదా చేస్తుంది.

## పైరసీ కోసం ఉద్యమం చేపట్టాలి : దిల్‌రాజ్



టాకీస్: తెలుగు సినిమాలు విడుదల రోజే పైరసీ అవుతున్న సందర్భంగా వాటిని అరికట్టేందుకు ఒక ఉద్యమం రావాలని ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత దిల్ రాజు అన్నారు. దిల్ రాజ్ నిర్మాణంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'. విక్టరీ వెంకటేశ్, సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రకాశ్ రాజ్ జయసుధ తదితరులు ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ చిత్రం 2013న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా వచ్చి 12 ఏండ్లు అవుతున్న సందర్భంగా రీ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. మార్చి 07న ఈ సినిమాను రీ రిలీజ్ చేస్తుండగా.. ఈ సందర్భంగా దిల్ రాజు ప్రెస్‌మీట్ నిర్వహించారు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వచ్చి 12 ఏండ్లు అవుతున్న ఈ సినిమాను ఇంకా ఆదరిస్తున్నారు. రీరిలీజ్ ఓపెనింగ్స్ చూస్తుంటే ఆనందంగా ఉంది. హైదరాబాద్‌లో పది థియేటర్లు హౌస్‌ఫుల్ అయిపోయాయి. ఆంధ్రాలో కూడా మంచి ఓపెనింగ్స్ వస్తాయి. ఈ వసూళ్లు చూస్తుంటే మాలో కొత్త ఎనర్జీ వస్తుంది. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రంలో యాడ్ చేయడానికి ఎక్స్ ట్రా ఫుటేజ్ చాలా ఉంది. కానీ అలాంటి ప్రయోగాలు ఏమీ చేయట్లేదు. ఇంతకు ముందు ఉన్న సినిమాను అలాగే విడుదల చేస్తున్నాం. మంచి చిత్రాలు ఎన్నిసార్లు రిలీజ్ చేసినా చూసేందుకు ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నారంటూ దిల్ రాజ్ తెలిపాడు. ఈ క్రమంలోనే తెలుగు సినిమాను భూతంలా పీడిస్తున్న పైరసీకి సంబంధించి స్పందించారు దిల్ రాజు. పైరసీని అరికట్టేందుకు ఒక ఉద్యమం రావాలని దిల్ రాజు అన్నారు. పైరసీని అరికట్టేందుకు మనం అందరం కలిసి ఒక ఉద్యమం లాంటిది తీసుకురావాలి. చాలామంది నిర్మాతలు తమ సినిమా విడుదల సమయంలో మాత్రమే ఈ సమస్య గురించి మాట్లాడతారు, కానీ ఆ తర్వాత అందరూ దాన్ని మర్చిపోతారు. అందుకే ఈ సమస్య ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉంటోంది అంటూ చెప్పుకొచ్చాడు దిల్ రాజు. పైరసీ వల్ల సినిమా పరిశ్రమకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని, కొత్త సినిమాలు విడుదలైన కొద్ది గంటల్లోనే అక్రమ వెబ్‌సైట్‌లలో అందుబాటులోకి వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమం విజయవంతం కావాలంటే, నిర్మాతలతో పాటు దర్శకులు, నటులు, డిస్ట్రిబ్యూటర్లు మరియు ప్రేక్షకులు కూడా సహకరించాలని దిల్ రాజు అభిప్రాయపడ్డారు.

## నాగార్జున్‌తో ఊరమాస్ సాంగ్ చేసిన పూజా హెగ్డే





టాకీస్: ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత డల్ అయింది. వరుస పరాజయాలతో ఆమెకి అవకాశాలే కరువయ్యాయి. స్టార్ హీరోలతో కలిసి పని చేసిన పూజా హెగ్డే ఇప్పుడు చిన్న హీరోలతో కూడా పని చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తుంది. అయితే పూజా హెగ్డేకి ఇప్పుడు తెలుగులో పెద్దగా అవకాశాలు లేవు. తమిళంలో మాత్రం రెండు సినిమాలు చేస్తుంది. అవి రెండూ భారీ మూవీస్ కావడం విశేషం. సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న కూలీలో స్పెషల్ సాంగ్ కూడా చేయబోతున్నట్టు టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాలు పూజా హెగ్డేకి ఎంత వరకు ప్లస్ అవుతాయా అని అభిమానులు చర్చించుకుంటున్నారు. పూజా హెగ్డే తెలుగులో ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్, నాగచైతన్య, అఖిల్, వరుణ్ తేజ్ వంటి హీరోలతో నటించింది. క్రేజ్ ఉన్న సమయంలో రెచ్చిపోయింది. రెమ్యునరేషన్ కూడా భారీగానే పెంచేసింది. వచ్చిన అవకాశాలని దేనిని వదులుకోలేదు. అయితే ఇందులో కొన్ని దెబ్బ కొట్టడంతో పూజా ఇప్పుడు రూట్ మార్చింది. కంటెంట్ ఉన్న సినిమాలు, బలమైన పాత్రలే చేయాలని అనుకుంటుందట. ఇప్పుడు కోలీవుడ్‌లో పూజా నటిస్తున్న విజయ్..జన నాయగన్, సూర్య..రెట్రో.. చిత్రాలు కూడా అలాంటివే అని తెలుస్తుంది. అయితే క్రేజ్ ఉన్న సమయంలోనే పూజా హెగ్డే రంగస్థలంలో జిగేల్ రాణి అనే స్పెషల్ సాంగ్‌కి చిందులేసింది. ఆ పాట థియేటర్లని ఊపేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాన్ని మించి..కూలీలో ఐటెమ్ సాంగ్ ఉంటుందట. అందులో కింగ్ నాగార్జునతో ఈ అమ్మడు ఆడిపాడనుందని అంటున్నారు. ఊరమాస్‌గా ఈ పాట ఉండనున్నట్టు తెలుస్తుండగా, ఇందులో నాగ్‌తో కలిసి పార్టీలో తెగ రచ్చ చేయనుందట. ఇందులో పూజా లుక్ కూడా అదిరిపోయేలా ఉంటుందని అంటున్నారు. కాగా, రజనీకాంత్ కూలీలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.